aruhi
aruhi group
BBTV
BBTV TELUGU
BBTVNETWORK

తెలుగు దినపత్రిక
నమస్తే
# మహాప్రభ
ప్రజల కోసం.., ప్రజలతో...మహాప్రభ
బుధవారం
28-01-2026 సంపుటి : 01 సంచిక : 3 పేజీలు : 08 వెల : ₹5/- RNI NO : TGTEL/26/A0738
Published From HYDERABAD,VIJAYAWADA తెలంగాణ , ఆంధ్రప్రదేశ్. www.mahaaprabha.com MAHAAPRABHA.DAILY

BESQAT
besqati.com
Contact : info@besqati.com

## ప్రజలకు అత్యుత్తమ సేవలే లక్ష్యం

- రెవెన్యూ వ్యవస్థలో సమూల మార్పులు
- కార్పొరేట్ స్థాయిలో ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు
- పటాన్‌చెరువులో ఇంటిగ్రేటెడ్ భవనానికి నేడు శంకుస్థాపన
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడి



హైదరాబాద్, జనవరి 27 (మహా ప్రభ)
తెలంగాణ ప్రజలకు వేగవంతంగా పారదర్శకంగా అత్యుత్తమ సేవలు అందించాలనే లక్ష్యంతో రెవెన్యూ వ్యవస్థలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గత పదేళ్లలో ఆనాటి పాలకుల స్వార్థపూరిత నిర్ణయాల వల్ల రెవెన్యూ వ్యవస్థ పూర్తిగా భ్రష్టుపట్టిపోయిందని విమర్శించారు. గడచిన రెండేళ్లుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సలహాలు, సూచనల మేరకు భ్రష్టుపట్టిన

-మిగతా 3 లో

# మోగిన మున్సిపల్ నగారా


## వెంటనే అమల్లోకి వచ్చిన ఎన్నికల కోడ్

### నేటి నుంచే నామినేషన్ల స్వీకరణ..30 వరకు గడువు

- ఫిబ్రవరి 11న పోలింగ్...12 అవసరమైతే రీపోలింగ్
- ఫిబ్రవరి 13న కౌంటింగ్ ..అదేరోజు ఫలితం వెల్లడి
- 16న మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ల ఎంపిక
- 31న నామినేషన్ల పరిశీలన...ఫిబ్రవరి 3 వరకు ఉపసంహరణ
- షెడ్యూల్ ప్రకటించిన కమిషనర్ రాణి కుముదిని

హైదరాబాద్, జనవరి 27 (మహా ప్రభ)
తెలంగాణ రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల నగారా మోగింది. 116 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్లకు సంబంధించి 2026 సాధారణ ఎన్నికల షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని అధికారికంగా విడుదల చేశారు. ఫిబ్రవరి 11న పోలింగం నిర్వహిస్తారు. రీ పోలింగ్ అవసరమైన చోట్ల 12న జరుపుతారు. వెంటనే ఎన్నికల కోడ్ అమల్లోకి రాగా, నేటినుంచే నామినేషన్ల స్వీకరణ మొదలు కానుంది.

-మిగతా 3 లో





## ఇండియా-ఈయూ మధ్య భారీ ట్రేడ్ డీల్


- స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందానికి అంగీకారం
- ఒప్పందం కుదిరిందన్న ప్రధాని మోడీ
- వాణిజ్య ఒప్పందంతో తగ్గనున్న స్కాచ్, కార్ల ధరలు

న్యూఢిల్లీ, జనవరి 27 (మహా ప్రభ)
భారత్-ఐరోపా సమాఖ్య మధ్య స్వేచ్ఛావాణిజ్య ఒప్పందం కుదిరినట్లు ప్రధాని నరేంద్రమోదీ వెల్లడించారు. భారత్-ఈయూ మధ్య ఎఫ్‌టీఏ కుదిరింది. ప్రపంచవ్యాప్తంగా ప్రజలు దీనిని మదర్ ఆఫ్ ఆల్ డీల్స్‌గా చర్చించుకుంటున్నారని పేర్కొన్నారు. మంగళవారం గోవాలో ఇండియా ఎనర్జీ వీక్- 2026ను వర్చువల్‌గా ప్రారంభించిన సందర్భంగా ట్రేడ్ డీల్ గురించి మాట్లాడారు. ఈ ఒప్పందంతో భారత్, ఐరోపా ప్రజలకు అద్భుతమైన అవకాశాలను అందిస్తుంది. ప్రపంచంలోనే పెద్ద ఆర్థికవ్యవస్థల మధ్య సమన్వయానికి నిదర్శనం. ప్రపంచ జీడీపీలో ఇండియా, ఈయూ ఉమ్మడి వాటా 25శాతం.

-మిగతా 3 లో




## ఫ్రాన్స్‌లో 15 ఏళ్లలోపు పిల్లలకు సోషల్ మీడియా బ్యాన్..!



- సోషల్ మీడియాపై నిబంధనలు సెప్టెంబర్ 1 నుంచి అమల్లోకి
- ఫిబ్రవరి చివరికి సెనెట్ ఈ బిల్లును ఆమోదించే అవకాశం
- ఫ్రాన్స్ దేశాధ్యక్షుడు ఇమాన్యుయేల్ మాక్రాన్ ప్రకటణ

న్యూఢిల్లీ, జనవరి 27 (మహా ప్రభ)
పిల్లలపై సామాజిక మాధ్యమాల ప్రభావాన్ని అరికట్టేందుకు ఫ్రాన్స్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పదిహేనేళ్లలోపు పిల్లలు సామాజిక మాధ్యమాలు వినియోగించకుండా ఓ చట్టం తీసుకురాబోతోంది. ఈ విషయాన్ని ఫ్రాన్స్ దేశాధ్యక్షుడు ఇమాన్యుయేల్ మాక్రాన్ ప్రకటించారు.పదిహేనేళ్లలోపు పిల్లలు సోషల్ మీడియాను ఉపయోగించడాన్ని నిషేధించే బిల్లుకు ఫ్రాన్స్ దిగువసభలోని శాసనసభ్యులు మద్దతిచ్చారని తెలిపారు. సెనెట్‌లో దీనిపై చర్చలు

-మిగతా 3 లో



## బడ్జెట్ పద్దులకు తుది దశకు

- ఫిబ్రవరి 1న కేంద్ర బ్జడెట్
- నార్త్ బ్లాక్‌లో హల్వా వేడుకలు
- పాల్గొన్న ఆర్థికమంత్రి నిర్మలా సీతరామన్
- నిర్మలా సీతారామన్ బ్జడెట్ ప్రవేశపెట్టడం ఇది వరుసగా తొమ్మిదోసారి

న్యూఢిల్లీ, జనవరి 27 (మహా ప్రభ)
ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టబోయే కేంద్ర బడ్జెట్‌కు సంబంధించిన పనులు తుది దశకు చేరుకున్నాయి. ఇందులో భాగంగా ఏటా నిర్వహించే హల్వా వేడుకను ఆర్థిక శాఖ కార్యాలయం నార్త్ బ్లాక్‌లో మంగళవారం సాయంత్రం నిర్వహించారు. ఈ వేడుకలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, సహాయ మంత్రి పంకజ్ చౌధరీ పాల్గొన్నారు. అలాగే ఆర్థిక శాఖ పరిధిలోని అన్ని విభాగాల కార్యదర్శులు, బ్జడెట్ రూపకల్పనలో భాగమైన అధికారులు కూడా హాజరయ్యారు. అనంతరం ఆమె బ్జడెట్ ప్రెస్‌ను పరిశీలించారు. ప్రింటింగ్, ఇతర ఏర్పాట్లను పర్యవేక్షించారు. నిర్మలా సీతారామన్ బ్జడెట్ ప్రవేశపెట్టడం ఇది వరుసగా తొమ్మిదోసారి. ఒక వైపు అంతర్జాతీయ భౌగోళిక రాజకీయ అనిశ్చితులు, మరోవైపు మన దేశం 7.4శాతం వృద్ధి సాధిస్తున్న తరుణంలో ఈ బడ్జెట్ వెలువడనుంది. హల్వా వేడుకతో బ్జడెట్ లాక్-ఇన్ పీరియడ్ ప్రారంభం అవుతుంది. అంటే బ్జడెట్ తయారీలో ప్రత్యక్షంగా

-మిగతా 3 లో

# నేటినుంచే మేడారం జాతర

### మొదలైన జాతర సందడి

- నేటి నుంచి నాలుగు రోజుల పాటు జాతర సాగనుంది
- పగిడిద్దరాజు, జంపన్నలను చేర్చే ఘట్టం ప్రారంభం
- ఏకకాలంలో 9-10 వేల మంది దర్శించుకొనే వెసులుబాటు
- ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ భక్తులకు ఇబ్బంది లేకుండా చర్యలు
- భారీగా ఏర్పాట్లు చేసిన తెలంగాణ ప్రభుత్వం

ములుగు జనవరి 27 (మహా ప్రభ)
రెండేళ్లకోమారు జరిగే మేడారం సమ్మక్క-సారలమ్మ మహా జాతరకు సర్వం సిద్ధమైంది. రాష్ట్ర ప్రభుత్వం దీనిని ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని ఏర్పాట్లు చేసింది. బుధవారం నుంచి నాలుగు రోజుల పాటు జాతర సాగనుంది. అమ్మవార్లను గద్దెలకు తీసుకుని రావడం మొదలు..మళల్‌ఈ అడవికి తరలించే వరకు జాతర సాగుతుంది. ఈ మహా ఘట్టాన్ని సమర్థంగా.. భక్తులకు ఇబ్బందులు లేకుండా నిర్వహించేందుకు అన్ని శాఖలు సన్నద్ధమయ్యాయి. ఈసారి సౌకర్యాల కల్పనతోపాటు నిర్మాణ పనులనూ

-మిగతా 3 లో






3 లో

## షాకిస్తున్న తాలిబన్ల కొత్త రూల్స్

- నాలుగు వర్గాలుగా ప్రజలు..
- అనాగరికం వైపు ఆఫ్ఘనిస్తాన్..



## తాను చెబుతున్న మొదటి దయ్యం అతనే

- అతనే గుంపు మేస్త్రీ రేవంత్‌కు గూఢచారి
- కెసిఆర్ ఎన్ని ఇడ్లీ తిన్నాడన్నది చేరవేసే ఏజెంట్
- మాజీ ఎంపి సంతోష్ రావుపై మండిపడ్డ కవిత

3 లో



## యాసిడ్ దాడి నిందితుల ఆస్తులు ఎందుకు వేలం వేయకూడదు..

- రాష్ట్రాలకు సుప్రీం ప్రశ్న
- బాధితులకు పునరావాసం, పరిహారం, చికిత్సవంటి వాటికోసం ఈ ఆస్తిని వాడుకోవచ్చు

న్యూఢిల్లీ, జనవరి 27 (మహా ప్రభ)
యాసిడ్ దాడి ఘటనల్లో బాధితులకు సాయం అందించేందుకు అవసరమైతే నిందితుల ఆస్తుల్ని ఎందుకు వేలం వేయకూడదో చెప్పాలని రాష్ట్రాలను సుప్రీం కోర్టు ప్రశ్నించింది. బాధితులకు పునరావాసం, పరిహారం, చికిత్స వంటి వాటికోసం ఈ ఆస్తిని వాడుకోవచ్చు కదా అని సుప్రీం కోర్టు సూచించింది. యాసిడ్ దాడిలో గాయపడి,

-మిగతా 3 లో

నమస్తే మహాప్రభ

# అందుకే ఆ ఒప్పందాన్ని రద్దుచేశాం..

### పాకిస్థాన్‌పై భారత్ మండిపాటు




**న్యూఢిల్లీ :-జనవరి 27 (మహా ప్రభ)** ఐక్యరాజ్యసమితి లో పాకిస్థాన్ వైఖరిని భారత్ మరోసారి ఎండగట్టింది. ఆపరేషన్ సిందూర్ పై ఆ దేశ రాయబారి చేసిన తప్పుడు ప్రచారాన్ని గట్టిగా తిప్పికొట్టింది. ఉగ్రవాదాన్ని చట్టబద్ధం చేసేందుకు ఆ దేశం ప్రయత్నిస్తోందని మండిపడింది. ఈ మేరకు ఐరాసలో భారత శాశ్వత ప్రతినిధి పర్వతనేని హరీశ్ ఘాటుగా స్పందించారు. సోమవారం ఐక్యరాజ్యసమితి భద్రతామండలి సమావేశంలో పాక్ రాయబారి ఆసిమ్ ఇఫ్తికార్ అహ్మద్ మాట్లాడుతూ.. ఆపరేషన్ సింధూర్, జమ్ముకశ్మీర్, సింధూ జలాల ఒప్పందం గురించి ప్రస్తావించారు. ఉగ్రవాదాన్ని శిక్షిస్తూ సరికొత్త సాధారణ స్థితి నెలకొల్పినట్లు భారత్ చెబుతున్న పరిస్థితి ఏమీ కనిపించడం లేదని పేర్కొన్నారు. ఈ విషయం ఆపరేషన్ సింధూర్ నేపథ్యంలో తమ ప్రతిస్పందనతోనే తేలిపోయిందని వ్యాఖ్యానించారు. దీనిపై ఐక్యరాజ్యసమితిలో భారత శాశ్వత ప్రతినిధి పర్వతనేని హరీశ్ ఘాటుగా స్పందించారు. అంతర్జాతీయ వేదికల్లో పాకిస్థాన్ ప్రతిసారీ భారత్‌కు, దేశ ప్రజలకు హాని కలిగించడమే అజెండాగా పెట్టుకుందని మండిపడ్డారు. ఈ సందర్భంగా పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి, ఆ తర్వాత భారత్ చేపట్టిన ఆపరేషన్ సింధూర్ గురించి వివరించారు. జమ్ముకశ్మీర్ భారత్‌లో అంతర్భాగమని హరీశ్ పునరుద్ఘాటించారు. భారత అంతర్గత అంశాలపై వ్యాఖ్యానించే హక్కు పాకిస్థాన్‌కు లేదన్నారు. 65 ఏళ్ల క్రితం విశ్వాసం, స్నేహం స్ఫూర్తితో భారత్ సింధూ జలాల ఒప్పందం చేసుకున్న విషయాన్ని ఆయన గుర్తుచేశారు. పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని ఎగదోస్తూ ఒప్పందాన్ని ఉల్లంఘించిందని అన్నారు. అందుకే భారత్ ఆ ఒప్పందాన్ని నిలిపివేసిందని తెలిపారు.

# బంగ్లాదేశ్‌లో హిందువుల హంతకులకు రక్షణ..


### యూనస్ ప్రభుత్వం ఆర్డినెన్స్



**న్యూఢిల్లీ :- జనవరి 27 (మహా ప్రభ)** బంగ్లాదేశ్‌లో ఒక పక్క హిందువులు, మైనారిటీలపై దాడులు జరుగుతుంటే వీటిని అడ్డుకోవాల్సిన అక్కడి ప్రభుత్వం నిందితులకు అండగా నిలుస్తోంది. హంతకులు, ఆందోళనకారులకు రక్షణ కల్పించే చర్యలు ప్రారంభించింది. ఇందుకోసం ప్రత్యేక ఆర్డినెన్స్ జారీ చేసింది. ప్రస్తుతం బంగ్లాదేశ్‌లో షేక్ హసీనా తర్వాత ముహమ్మద్ యూనస్ ఆధ్వర్యంలో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడిన సంగతి తెలిసిందే. ఈ ప్రభుత్వం ఏర్పాటయ్యాక అక్కడ ఆందోళనలు ఎక్కువయ్యాయి. పోలీసులు, భద్రతా బలగాలతోపాటు హిందువులపై, రాజకీయ ప్రత్యర్థులపై ఆందోళనకారులు దాడులు, హత్యలు చేశారు. గత ఏడాది జులై- ఆగష్టు సమయంలో ఈ దాడులు ఎక్కువగా జరిగాయి. ఈ ఘటనల్లో పోలీసులతోపాటు హిందువులు, ఇతర పౌరులు మరణించారు. పలు ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులు భారీగా ధ్వంసమయ్యాయి. ఈ ఘటనల్లో నిందితులపై చర్యలు తీసుకోవాల్సిన యూనస్ ప్రభుత్వం ఇప్పుడు వారికి అండగా నిలిచింది. వారిపై కఠిన చర్యలు తీసుకోకుండా ప్రత్యేక ఆర్డినెన్స్ జారీ చేసింది. ప్రొటెక్షన్ అండ్ లయబిలిటీ డిటర్మినేషన్ ఆర్డినెన్స్ 2026ను ఆదివారం అర్ధరాత్రి జారీ చేసింది. దీని ప్రకారం ఈ ఘటనల్లో నిందితులకు రక్షణ ఉంటుంది. వారిపై కఠిన చర్యలు తీసుకోవడానికి వీల్లేదు. నిందితులపై ఇప్పటివరకు నమోదైన సివిల్, క్రిమినల్ కేసుల్ని రద్దు చేస్తారు. అలాగే కొత్త కేసులు నమోదు చేయడానికి వీల్లేదు. దీంతో జులై, ఆగష్టులో పోలీసులు, హిందువులు, మైనారిటీలు, అవామీ లీగ్ సభ్యుల్ని చంపిన వారిపై చర్యలుండవు. ఇస్లామిస్టులు, అతివాదులు అయిన హంతకులు ఇకపై స్వేచ్ఛగా తిరుగుతారు. బంగ్లా మాజీ ప్రధాని షేక్ హసీనాకు వ్యతిరేకంగా అప్పట్లో ఆందోళనకారులు తీవ్ర హింసకు పాల్పడ్డారు. పోలీస్ స్టేషన్లు కూడా తగలబెట్టేశారు. కొందరిని లక్ష్యంగా చేసుకుని హత్యలు చేశారు. అక్కడ ఏడాదిన్నర కాలంగా హసీనా పాలనకు వ్యతిరేకంగా ఆందోళనలు సాగుతున్నాయి. ఈ ఘటనల్లో గత అక్టోబర్ వరకు 44 మంది పోలీసులు మరణించినట్లు అక్కడి నివేదికలు తెలిపాయి. ఆగష్టు 5, 2024న బంగ్లాదేశ్‌లో ప్రభుత్వం కూలిపోయింది. తనకు వ్యతిరేకంగా జరిగిన ఆందోళనల నేపథ్యంలో షేక్ హసీనా ఇండియాకు వచ్చి ఆశ్రయం పొందుతున్నారు.

# నేటి నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు

### ఉపాధి హామీ పథకం, సర్‌పై చర్చ జరగాలి
### అఖిలపక్ష భేటీలో విపక్షాల పట్టు.. కుదరదన్న కేంద్రం



**న్యూఢిల్లీ :- జనవరి 27 (మహా ప్రభ)** పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. బుధవారం ఉభయసభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగించనున్నారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గురువారం పార్లమెంట్‌లో ఆర్థిక సర్వేను ప్రవేశపెట్టనున్నారు. అనంతరం ఫిబ్రవరి 1న కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెడతారు. పార్లమెంట్ సమావేశాలను పురస్కరించుకొని ప్రభుత్వం మంగళవారం అఖిలపక్ష సమావేశం ఏర్పాటుచేసింది. ఈ సందర్భంగా వివిధ విపక్షాలకు చెందిన నేతలు మాట్లాడుతూ.. యూపీఏ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉపాధి హామీ పథకం పునరుద్ధరణ, ఓటర్ల జాబితాను సవరించేందుకు చేపట్టిన 'సర్' ప్రక్రియ, భారత విదేశాంగ విధానం, వివాదాస్పదమైన యూజీసీ కొత్త మార్గదర్శకాలపై చర్చ జరగాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకాన్ని పునరుద్ధరించాలన్న డిమాండ్‌ను, సర్‌పై విస్తృత చర్చను ప్రభుత్వం తోసిపుచ్చింది.

# ఏపీకి రానున్న రాహుల్ గాంధీ

**న్యూఢిల్లీ :- జనవరి 27 (మహా ప్రభ)** ఏపీ కాంగ్రెస్ కమిటీ (ఏపీసీసీ) అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఢిల్లీలో ఏఐసీసీ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీతో భేటీ అయ్యారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ చేపట్టనున్న ఉద్యమంలో పాల్గొనాలని ఆమె చేసిన ఆహ్వానానికి రాహుల్ గాంధీ సానుకూలంగా స్పందించారు. ఏపీ పర్యటనకు వస్తానని, పార్టీ పోరాటంలో భాగస్వామ్యం అవుతానని ఆయన హామీ ఇచ్చినట్టు షర్మిల తెలిపారు. మంగళవారం ఢిల్లీలోని 10 జనపథ్‌లో ఉన్న రాహుల్ గాంధీ నివాసంలో ఈ సమావేశం జరిగింది. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్త ఉద్యమం చేపట్టాలని కాంగ్రెస్ నిర్ణయించింది. ఈ ఉద్యమంలో పాల్గొనాల్సిందిగా షర్మిల రాహుల్‌ను కోరారు. ఇందుకు రాహుల్ అంగీకరించారని, త్వరలోనే ఏపీకి వస్తానని మాట ఇచ్చారని ఆమె ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# స్మార్ట్‌ఫోన్‌లోనే ఆధార్ సవరణలు
## ఇంటివద్దే మొబైల్ నంబర్ అప్‌డేట్




**న్యూఢిల్లీ :- జనవరి 27 (మహా ప్రభ)** ఆధార్ హోల్డర్లు తమ మొబైల్ ఫోన్ నంబర్లను తమ స్మార్ట్‌ఫోన్ల ద్వారా అప్‌డేట్ చేసుకోవడానికి భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (యూఐడీఏఐ) అవకాశం కల్పించింది. బుధవారం నుంచి ఎక్కడి నుంచి అయినా, ఏ సమయంలోనైనా ఈ సదుపాయాన్ని వినియోగించుకోవచ్చు. ఫోన్ నంబర్ అప్‌డేట్ కోసం ఇకపై ఎన్‌రోల్‌మెంట్ కేంద్రాలకు వెళ్లవలసిన అవసరం ఉండదు. కొత్తగా అమల్లోకి వచ్చిన విధానంలో ఫేస్ ఆథెంటికేషన్, ఓటీపీ ద్వారా మొబైల్ నంబర్ అప్‌డేట్ జరుగుతుంది.

# బద్రీనాథ్ ఆలయాన్ని కమ్మేసిన మంచు దుప్పటి..



**న్యూఢిల్లీ - జనవరి 27 (మహా ప్రభ)** ఉత్తరాదిన పలు ప్రాంతాల్లో మంచు వర్షం కురుస్తోంది. జమ్ము కశ్మీర్, హిల్ స్టేషన్‌గా పేరుగాంచిన హిమాచల్ ప్రదేశ్ తోపాటు ఉత్తరాఖండ్‌లో మంచు వర్షం భారీగా కురుస్తోంది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న మంచు కారణంగా ఆయా రాష్ట్రాల్లోని పలు ప్రధాన మార్గాల్లో రాకపోకలకు అంతరాయం ఏర్పడి.. జనజీవనం స్తంభించిపోయింది. ఉత్తరాఖండ్‌లో చమోలీలోని ప్రముఖ పుణ్యక్షేత్రం బద్రీనాథ్ ఆలయాన్ని మంచు దుప్పటి కమ్మేసింది. ఆలయంపై తెల్లటి దుప్పటి పరిచారా..? అన్నట్టుగా ఉన్న మంచు విజువల్స్ ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతున్నాయి. చాలా ప్రాంతాలను మంచు కప్పేస్తుండగా.. గడ్డకట్టే చలిలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

# వందే మాతరానికీ నిలబడాల్సిందే!

### జాతీయ గీతం ప్రొటోకాల్స్ విస్తరణకు ప్రభుత్వం యోచన



**న్యూఢిల్లీ :- జనవరి 27 (మహా ప్రభ)** జాతీయ గీతం జన గణ మన తరహాలోనే త్వరలో వందేమాతరం గేయాలాపన సందర్భంగా కూడా ప్రజలు నిలబడక తప్పదు. జాతీయ గీతానికి ఉన్న ప్రొటోకాల్స్‌నే 150వ వార్షికోత్సవం సందర్భంగా వందే మాతరం గేయానికి కూడా విస్తరించాలని ప్రభుత్వం యోచిస్తున్నది. అయితే ఇప్పటివరకు దీనిపై ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. జాతీయ గౌరవానికి అవమానాల నిరోధక చట్టం, 1971 ప్రస్తుతం జాతీయ గీతానికి మాత్రమే వర్తిస్తున్నది. రాజ్యాంగంలోని 51(ఏ) అధికరణ ప్రకారం కూడా జాతీయ గీతానికి ప్రజలు గౌరవించడం తప్పనిసరి. అయితే వందే మాతరం ఆలాపన సందర్భంగా ప్రజలు నిలబడాలన్న నిబంధనలు లేవు.

# పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు..


### తాము సిద్ధమేనంటున్న ఇరాన్
### ఏ క్షణమైనా ఇరాన్‌పై అమెరికా దాడి చేసే అవకాశం



**వాషింగ్టన్ :- జనవరి 27 (మహా ప్రభ)** పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్నాయి. ఏ క్షణమైనా ఇరాన్‌పై అమెరికా దాడికి దిగవచ్చునని భావిస్తున్నారు. రెండు దేశాల మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్న క్రమంలో అణు సామర్థ్యం కల యూఎస్ యుద్ధ విమాన వాహక నౌక అబ్రహం లింకన్ (సీవీఎన్-72) పశ్చిమాసియాలోని యూఎస్ సెంట్రల్ కమాండ్ ప్రాంతంలోకి అడుగుపెట్టడం ఈ వాదనకు బలం చేకూరుస్తున్నది. దీంతో ఇరాన్‌పై నేరుగా వైమానిక దాడికి అమెరికా రంగం సిద్ధం చేసినట్టయ్యింది. పైగా లింకన్ ఏమీ ఒంటరిగా రంగంలోకి దిగలేదు. దాని పక్కనే మూడు గైడెడ్ క్షిపణి డిస్ట్రాయర్లు ఉన్నాయి. అవి యూఎస్ఎస్ ఫ్రాంక్ ఈ. పీటర్సన్ జూనియర్, యూఎస్ఎస్ స్ప్రూయెన్స్, యూఎస్ఎస్ మైఖేల్ మర్ఫీ నౌకలు. ఇరాన్‌పై దాడి చేస్తే పూర్తి స్థాయి యుద్ధం తప్పదని అమెరికాకు హెజ్బొల్లా, హౌతీలు హెచ్చరికలు జారీ చేశాయి. అమెరికా దాడి చేస్తే ఎదుర్కోవడానికి ఇరాన్ మిలిటరీ సన్నద్ధమైంది. అమెరికాతో రహస్యంగా తాము శాంతి చర్చలు జరిపామని వస్తున్న వార్తలను ఇరాన్ విదేశాంగ శాఖ తోసిపుచ్చింది.

# అమెరికాపై విరుచుకుపడిన మంచు తుఫాను

### నిలిచిన విద్యుత్ సరఫరా



**వాషింగ్టన్ న్యూఢిల్లీ :- జనవరి 27 (మహా ప్రభ)** అమెరికాపై మంచు తుఫాను విరుచుకుపడుతోంది. ఈశాన్యప్రాంతాల్లో సోమవారం మరింత అధికంగా మంచు కురిసిందని, ఇప్పటికే దక్షిణాది భాగాలు మంచుదుప్పటి కప్పేసిందని అధికారులు తెలిపారు. చాలా ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా కూడా నిలిచిపోయిందని అన్నారు. ఇప్పటివరకు 30మంది మరణించినట్లు అధికారులు తెలిపారు. అర్కాన్సాస్ నుండి న్యూఇంగ్లండ్ వరకు 2,100కి.మీ మేర మంచు విస్తరించింది. దీంతో ట్రాఫిక్ కు అంతరాయం ఏర్పడింది. పాఠశాలలు మూసివేశారు. విమానాలు రద్దు చేశారు. పిట్స్‌బర్గ్ కు ఉత్తరాన 20 అంగుళాల మేర మంచు కురిసినట్లు నేషనల్ వెదర్ సర్వీస్ పేర్కొంది. ఉష్ణోగ్రతలు మైనస్ 31 డిగ్రీల సెల్సియస్ (25డిగ్రీ ఫారన్‌హీట్)కి పడిపోయాయని తెలిపింది. యుఎస్ లో మూడింట రెండువంతుల మందిని మంచు తీవ్రంగా ప్రభావితం చేస్తోంది. మరికొన్ని రోజులు ఇదే పరిస్థితి కొనసాగే అవకాశం ఉందని వాతావరణ విభాగం సోమవారం హెచ్చరించింది. ఈ వారంతంలో ఈస్ట్ కోస్ట్ లోని కొన్ని భాగాల్లో మరో మంచు తుఫాను తాకే అవకాశం ఉందని హెచ్చరించింది. విద్యుత్ పునరుద్ధరణకు రెండు రోజులు పట్టే అవకాశం ఉందని అన్నారు. దేశవ్యాప్తంగా సోమవారం 12,000కంటే ఎక్కువ విమానాలు రద్దయ్యాయని ఫ్లైట్? ట్రాకర్? పేర్కొంది.

## ఫ్రాన్స్‌లో 15 ఏళ్లలోపు పిల్లలకు సోషల్ మీడియా బ్యాన్..!

మొదటి తరువాయి

జరిపి బిల్లుపై నిర్ణయం తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. పిల్లలు గంటలకొద్దీ సమయాన్ని స్క్రీన్‌కు కేటాయించడంవల్ల వారిలో తలెత్తుతున్న ఆరోగ్య, మానసిక సమస్యలను నివారించడానికి ఈ చర్యలు తీసుకుంటున్నట్లు మేక్రాన్ వెల్లడించారు. ఫిబ్రవరి చివరికి సెనెట్ ఈ బిల్లును ఆమోదించే అవకాశం ఉందని ఫ్రాన్స్ అధికారులు తెలిపారు. సోషల్ మీడియాపై నిబంధనలు సెప్టెంబర్ 1 నుంచి అమల్లోకి వస్తాయన్నారు. పదిహేనేళ్లలోపు పిల్లల ఖాతాలను తొలగించడానికి సామాజిక మాధ్యమాల సంస్థలకు డిసెంబర్ 31 వరకు సమయం ఇస్తున్నట్లు తెలిపారు. ఈ బిల్లులో పాఠశాలల్లో పిల్లల మొబైల్ ఫోన్ వాడకంపై కూడా నిషేధం ఉంటుందని చెప్పారు. ఈ చట్టం అమల్లోకి వస్తే టీనేజర్లకు సోషల్ మీడియా వాడకంపై దేశవ్యాప్తంగా నిషేధాన్ని ప్రవేశపెట్టిన రెండో దేశంగా ఫ్రాన్స్ నిలుస్తుంది. ఇప్పటికే ఆస్ట్రేలియా ప్రభుత్వం దేశంలోని పదహారేళ్ల కన్నా తక్కువ వయసున్నవారు సోషల్ మీడియా వాడకుండా నిషేధించింది. ఇతర దేశాలు కూడా ఈ నిబంధనలను అమలు చేయడానికి ఆసక్తి చూపిస్తున్నాయి.

## బడ్జెట్ పద్దులకు తుది దశకు


మొదటి తరువాయి

పాల్గొనే అధికారులు, సిబ్బంది పార్లమెంట్‌లో వార్షిక పద్దును ప్రవేశపెట్టేవరకు ఆ నార్త్ బ్లాక్‌లోనే ఉంటారు. వారు బయటకు వెళ్లడానికి వీలుండదు. వారు ఎల్లప్పుడూ సీసీటీవీ కెమెరాలు, భద్రతా సిబ్బంది నిఘాలో ఉంటారు. కనీసం వారు ఫోన్ చేయడానికి కూడా వీలుండదు. ఒకసారి పార్లమెంట్‌లో నిర్మలా సీతారామన్ బ్జడెట్ ప్రసంగం పూర్తయిన తర్వాతే వీరు బయటకు వస్తారు. అంటే ఐదురోజులపాటు వీరికి బాహ్య ప్రపంచంతో సంబంధాలు ఉండవన్నమాట. 1950లో బడ్జెట్ ముద్రణ పక్రియ కొనసాగుతున్న సమయంలో లీక్ అవ్వడంతో ఈ లాక్-ఇన్ నిర్ణయం తీసుకున్నారు.

## షాకిస్తున్న తాలిబన్ల కొత్త రూల్స్

**-నాలుగు వర్ణాలుగా ప్రజలు..**
**-అనాగరికం వైపు ఆఫ్ఘనిస్తాన్..**

**న్యూఢిల్లీ,**



తాలిబన్ల పాలనలో ఆఫ్ఘనిస్తాన్ ఇప్పటికే తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న సంగతి తెలిసిందే. ప్రజలకు తినడానికి తిండి కూడా దొరకని పరిస్థితి. ఆర్థిక వ్యవస్థ దారుణంగా దెబ్బతింది. నిరుద్యోగం పెరిగింది. స్త్రీలపై ఆంక్షలు విధించారు. ఆడ పిల్లలకు చదువు దూరంచేశారు. ఇలాంటి ఎన్నో అనాగరిక ఆచారాల్ని తాలిబన్లు అమలు చేస్తున్నారు. ఇవేవీ చాలవన్నట్లు ఇప్పుడు కొత్తగా అక్కడ వర్ణ లేదా వర్గ విబేధాలు కూడా తీసుకొచ్చినట్లు తెలుస్తోంది.ఆఫ్ఘన్‌కు సంబంధించి వెల్లడైన కొన్ని నివేదికల ప్రకారం.. మన దేశంలో గతంలో ఉన్న చాతుర్వర్ణ వ్యవస్థలాంటిదే తాలిబన్లు ప్రస్తుతం అక్కడ అమలు చేస్తున్నారు. దీని ప్రకారం.. తాలిబన్ పాలకులు.. ప్రజలను నాలుగు వర్ణాలుగా విభజించారు. ఉన్నత శ్రేణిలో ముల్లాలు వంటి మత గురువులు ఉంటారు. వీరికి కోర్టు విచారణలు, శిక్షల నుంచి మినహాయింపు ఉంటుంది. వీరు వేరే వారి ఎముకలు విరిచేసినా, ఇతర నేరాలు చేసినా మినహాయింపు ఉంటుంది. ఒకవేళ వీరు తప్పు చేస్తే శిక్షించడానికి వీల్లేదు. కానీ, వార్నింగ్ ఇవ్వొచ్చు. అలాగే పదేళ్లు దాటిన పిల్లలు ప్రార్థన చేయకపోతే, ఆ పిల్లల్ని కఠినంగా శిక్షించవచ్చు. మధ్యలో రెండో స్థానంలో ఎలైట్ గ్రూప్.. అంటే అష్రఫ్, అరిస్టోక్రాట్స్, మూడోస్థానంలో మిడిల్ క్లాస్ ఉంటారు. ఇక.. అధమస్థాయిలో గులామీలు ఉంటారు. అంటే వీరు అత్యల్ప వర్గం, బానిసల కింద లెక్క. వీరికి అత్యంత కఠిన శిక్షలు అమలు చేస్తారు. ఒకే నేరానికి నాలుగు విభాగాల వారికి వేర్వేరు శిక్షలుంటాయి. ఈ రూల్స్ అన్నింటికి సంబంధించి 'క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ ఫర్ కోర్ట్స్' పేరిట ఆదేశాలు జారీ చేశారు. దీనికి తాలిబన్ల సుప్రీం హిబతుల్లా ఆమోదం తెలిపాడు. ఈ ఆదేశాలపై మానవ హక్కుల సంఘాలు మండిపడుతున్నాయి. ప్రజల్ని ఇలా విభజించడం సరికాదని మండిపడుతున్నాయి.

## యాసిడ్ దాడి నిందితుల ఆస్తులు ఎందుకు వేలం వేయకూడదు..

మొదటి తరువాయి

కోలుకున్న షహీన్ మాలిక్ అనే మహిళ 2009లో దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు తాజా వ్యాఖ్యలు చేసింది. చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ ఆధ్వర్యంలోని బెంచ్ దీనిపై స్పందించింది. దీనిపై విచారణ జరిపిన కోర్టు.. యాసిడ్ దాడి బాధితులకు కనీస పరిహారంగా అందిస్తున్న రూ.3 లక్షలు సరిపోవని వ్యాఖ్యానించింది. ఈ పరిహారం పెంచేందుకు అవసరమైతే నిందితుల ఆస్తుల్ని జప్తు చేసి, వేలం ఎందుకు వేయకూడదో చెప్పాలని సూచించింది. యాసిడ్ దాడి ఘటనల్లో నిందితులకు అత్యంత కఠినమైన శిక్షలు వేయడం ద్వారా ఈ తరహా నేరాల్ని నియంత్రించాలని కోర్టు అభిప్రాయపడింది. కోర్టు వ్యాఖ్యల ప్రకారం.. ప్రస్తుతం అందిస్తున్న మూడు లక్షల కనీస పరిహారం బాధితుల చికిత్స కోసం సరిపోదు. కొందరికి జీవిత కాల చికిత్స అవసరం. అలాగే పరిహారం, పునరావాసం వంటికి కూడా ఈ డబ్బులు సరిపోవు. అందుకే పరిహారం పెంచాలని, నిందితుల ఆస్తుల్ని జప్తు చేసి, వేలం వేసే విషయం గురించి ఆలోచించాలని సూచించింది. ప్రతి బాధితురాలి కేసు వాదించేందుకు హైకోర్టులో టాప్ లాయర్?ను నియమించాలని కూడా ఆదేశించింది. తాను యాసిడ్ దాడి కేసులో 16 ఏళ్లుగా పోరాడుతున్నానని, తనకు న్యాయం జరగలేదని, నిందితులంతా కింది కోర్టుల్లోనే విడుదలయ్యారని బాధితురాలు కోర్టు దృష్టికి తీసుకొచ్చింది. ఈ పోరాటంలో తాను జీవితంలో ఎంతో విలువైన సమయాన్ని కోల్పోయానని చెప్పింది. దీనిపై స్పందించిన కోర్టు తాజా సూచనలు చేసింది. అలాగే వివిధ రాష్ట్రాల్లో ఉన్న యాసిడ్ దాడి కేసుల వివరాలు, బాధితుల వివరాలు, నిందితులకు పడ్డ శిక్ష వంటి వివరాలు సమర్పించాలని రాష్ట్రాలను, కేంద్ర పాలిత ప్రాంతాలను ఆదేశించింది.

## తాను చెబుతున్న మొదటి దయ్యం అతనే

**అతనే గుంపు మేస్త్రీ రేవంత్‌కు గూఢఛారి**
**కెసిఆర్ ఎన్ని ఇడ్లీ తిన్నాడన్నది చేరవేసే ఏజెంట్**
**మాజీ ఎంపి సంతోష్ రావుపై మండిపడ్డ కవిత**

**హైదరాబాద్,**

తాను చెప్పిన మొదటి దయ్యం సంతోష్ రావేనని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. ఉద్యమకారులకు ఉద్యమ నాయకుడిని దూరం చేసింది అతనేనని కవిత ఘాటుగా విమర్శించారు. గద్దర్ లాంటి నాయకులు గేటు బయట ఉండాల్సి వచ్చిందంటే దానికి కారణం ఆయనేనని ఆరోపించారు. నిమ్స్‌లో చికిత్స పొందుతున్న ఎక్సైజ్ కానిస్టేబుల్ సౌమ్యను పరామర్శించిన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ మాజీ రాజ్యసభ సభ్యుడు సంతోష్ రావుకు ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సంచలన కామెంట్స్ చేశారు. సంతోష్ రావుపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. 'కేసీఆర్ దగ్గర ఉన్న మొదటి దెయ్యం సంతోష్ రావు' అని వ్యాఖ్యానించారు. రేవంత్ రెడ్డికి ప్రధాన గూఢాచారి కూడా సంతోష్ రావేనని ఆరోపించారు.ఫాంహౌస్‌లో కేసీఆర్ ఫుల్ ఇడ్లీ తిన్నారా? సగం ఇడ్లీ తిన్నారా? అనే సమాచారాన్ని రేవంత్‌కు సంతోష్ చేరవేస్తాడని వ్యంగ్యాస్త్రాలు సంధించారు కవిత. బీఆర్ఎస్‌లో ఎందరో నేతలతో కన్నీళ్లు పెట్టించిన దుర్మార్గుడు సంతోష్ అని మండిపడ్డారు. ప్రగతి భవన్ గేటు బయట గద్దర్‌ను నిలబెట్టింది, ఈటల బీఆర్ఎస్ సస్పెండ్‌కు కారణం సంతోష్ రావే అని కవిత ఆరోపణలు గుప్పించారు.

# మోగిన మున్సిపల్ నగారా

మొదటి తరువాయి



ఈ ఎన్నికల పక్రియ ద్వారా మొత్తం 52 లక్షల 43 వేల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ప్రజాస్వామ్య పండుగలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని కమిషనర్ ఈ సందర్భంగా కోరారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం ఈ నెల 28వ తేదీ బుధవారం నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కానుంది. అభ్యర్థులు తమ నామినేషన్లను జనవరి 30వ తేదీ సాయంత్రం 5:00 గంటల వరకు దాఖలు చేయవచ్చు. జనవరి 31న నామినేషన్ల పరిశీలన చేపట్టి, అదే రోజు సాయంత్రం అర్హత పొందిన అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తారు. ఫిబ్రవరి 3వ తేదీ మధ్యాహ్నం 3:00 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఇచ్చారు. అనంతరం తుది బరిలో నిలిచే అభ్యర్థుల జాబితాను విడుదల చేస్తారు. అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, పోలీసు కమిషనర్లతో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణికుముదిని సమావేశం నిర్వహించారు. అనంతరం ఎస్ఈసీ రాణికుముదిని ఎన్నికల షెడ్యూల్ విడుదల చేశారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. షెడ్యూల్ మేరకు 28 నుంచి నామినేషన్ల పక్రియ ప్రారంభం అవుఉతంది. 30తో నామినేషన్ల స్వీకరణ గడవు ముగియనున్నది. 31న అభ్యర్థుల నామినేషన్ల పరిశీలన అనంతరం అర్హత పొందిన వారి జాబితా ప్రకటిస్తారు. ఫిబ్రవరి 3.. నామినేషన్ల ఉపసంహరణకు తుది గడువు కాగ,ఫిబ్రవరి 11న పోలింగ్ నిర్వహిస్తారు. రీపోలింగ్ ఎక్కడైనా ఉంటే ఫిబ్రవరి 12న నిర్వహిస్తారు. ఫిబ్రవరి 13న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితం ప్రకటిస్తారు. ఫిబ్రవరి 16న మున్సిపల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నిక జరుగుతుంది. ఫిబ్రవరి 16న కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నిక చేపడతారు. మున్సిపల్ ఎన్నికల్లో 53 లక్షల మందికి పైగా ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నట్లు కమిషనర్ తెలిపారు.

# ప్రజలకు అత్యుత్తమ సేవలే లక్ష్యం

మొదటి తరువాయి



వ్యవస్థను సంస్కరిస్తూ రెవెన్యూ సేవలను ప్రజలకు చేరువ చేస్తున్నామని తెలిపారు. ఇంటిగ్రేటెడ్ కార్యాలయాల ఏర్పాటుపై మంగళవారం నాడు సచివాలయంలో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి గారు మాట్లాడుతూ .. ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో 39 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను 11 క్లస్టర్‌లుగా విభజించి ప్రభుత్వంపై ఎలాంటి ఆర్థికభారం పడకుండా ప్రైవేటు నిర్మాణ రంగ సంస్థలతో నిర్మిస్తున్నామని నిర్మాణంతో పాటు ఐదు సంవత్సరాల నిర్వహాణాబాధ్యతను కూడా ఆ సంస్థలే తీసుకున్నాయని తెలిపారు. మూడు నుంచి ఐదు ఎకరాల స్థలంలో కార్యాలయాలను ఏర్పాటు చేస్తున్నామని వివాహ రిజిస్ట్రేషన్ల కోసం మినీ మ్యారేజీ హాల్, గర్భిణీలకు, వృద్దులకు ప్రత్యేక వసతులు, విశాలమైన వెయిటింగ్ ఏరియా మహిళల కోసం ఫీడింగ్ రూమ్, చిన్నపిల్లల కోసం క్రెచ్, వృద్దులు, దివ్యాంగుల కోసం ఆధునిక లిఫ్ట్ సౌకర్యం తదితరాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. త్వరలో మిగిలిన కార్యాలయాలకు శంకుస్థాపనలకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. రెండవ విడతలో జిల్లా కేంద్రాల్లో ఇంటిగ్రేటెడ్ భవనాలను నిర్మిస్తామని ఇందుకు అవసరమైన కార్యాచరణను సిద్దం చేయాలని సూచించారు. ఇప్పటికే తాలిమ్‌లో ఇంటిగ్రేటెడ్ భవన నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయని జూన్ 2వ తేదీ నాటికి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. ఇటీవల మేడ్చల్ జిల్లాలో భవనానికి శంకుస్థాపన చేయడం జరిగిందని పఠాన్ చెరువు-శంకరపల్లి ప్రధాన రహదారి సమీపంలో రాజపుష్ప కనస్ట్రక్షన్ నిర్మించే ఇంటిగ్రేటెడ్ భవనానికి బుధవారం నాడు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ శాఖలో స్లాట్ బుకింగ్, ఈ ఆధార్ సంతకం వంటి సౌకర్యాలతో ప్రజల సమయాన్ని ఎంతో ఆదా చేశామని అన్నారు. రెవెన్యూ శాఖలో తీసుకుంటున్న ఈ సంస్కరణలు కేవలం కార్యాలయాల మార్పు మాత్రమే కాకుండా, ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొచ్చే సంస్కరణలుగా నిలుస్తాయని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు.

# ఇండియా-ఈయూ మధ్య భారీ ట్రేడ్ డీల్

మొదటి తరువాయి

ప్రపంచవాణిజ్యంలో ఇది మూడోవంతుకు సమానం. ఈ డీల్ ఇరువర్గాల మధ్య వాణిజ్యాన్ని పెంపొదించడమేగాకుండా.. ప్రజాస్వామ్యం, చట్టబద్ధపాలనపై మన నిబద్ధతను బలోపేతం చేస్తుందని మోదీ వెల్లడించారు. ఈ ప్రకటన అనంతరం హైదరాబాద్ హౌస్‌లో మోదీ, యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టా, ఐరోపా కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్‌డెర్ లెయన్ సమావేశమయ్యారు. వారు ఇండియా-ఈయూ శిఖరాగ్ర సదస్సులో పాల్గొన్నారు. ఇక ఈ ఎనర్జీ వీక్‌లో భాగంగా ప్రపంచవ్యాప్తంగా దాదాపు 150 దేశాలకు చెందిన ప్రతినిధులు గోవాకు వచ్చారు. మీరంతా ఇంధన భద్రత, సుస్థిర భవిష్యత్తు గురించి మాట్లాడేందుకు భారత్‌కు వచ్చారు. మా వద్ద భారీ రిఫైనింగ్ సామర్థ్యాలు ఉన్నాయి. ఈ విషయంలో మేం ప్రపంచంలోనే రెండో స్థానంలో ఉన్నాం. త్వరలో నంబర్‌వన్ స్థానానికి చేరుకుంటాం అని వెల్లడించారు. భారత్- యూరోపియన్ యూనియన్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం పూర్తయింది. 18 సంవత్సరాల నిరీక్షణ తర్వాత భారతదేశం, యూరోపియన్ యూనియన్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదరడం వైన్, విస్కీ ప్రియులు, లగ్జరీ కార్ల అభిమానులకు ఆనందాన్ని ఇస్తోంది. ఈ ట్రేడ్ డీల్ ద్వారా భారతీయ వస్తువులకు యూరోపియన్ మార్కెట్ల తలుపులు తెరుచుకుంటాయి. యూరప్ నుంచి దిగుమతి అయిన వస్తువులు భారతదేశంలో చౌకగా లభిస్తాయి. ఈ ఒప్పందాన్ని 'అన్ని వాణిజ్య ఒప్పందాలకు తల్లి' అని యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లేయన్ అభివర్ణించారు. ప్రస్తుతం యూకే నుంచి భారత్‌కు దిగుమతి అవుతున్న స్కాచ్ విస్కీ, జిన్‌పై 150 శాతం సుంకాలను విధిస్తున్నారు. తాజా ఒప్పందం నేపథ్యంలో ఆ సుంకాలు 20 శాతానికి తగ్గుతాయి. అయితే దీనిని వెంటనే కాకుండా 5-10 సంవత్సరాల కాల వ్యవధిలో అమలు చేస్తారు. దీంతో యూరప్‌నకు చెందిన ప్రీమియం జిన్‌లు, వైన్, వోడ్కాలు చౌకగా లభిస్తాయి. అలాగే భారతీయ మద్యానికి కూడా ఈయూ సభ్య దేశాలలో పన్ను మినహాయింపులు లభిస్తాయి. మెర్సిడెస్, బీఎమ్‌డబ్ల్యూ, ఆడి వంటి యూరోపియన్ కార్లకు ప్రస్తుతం 100 శాతం పన్నులు విధిస్తున్నారు. ఒప్పందం తర్వాత ఆ పన్నులు నిర్ణయించిన కాల వ్యవధిలో పది శాతానికి తగ్గుతాయి. అయితే రూ. 25 లక్షల కంటే తక్కువ ధరకు అమ్ముడుపోయే అవకాశం ఉన్న కార్లను మాత్రం భారత్‌కు ఈయూ ఎగుమతి చేయదు. భారత ఆటోమొబైల్ పరిశ్రమను రక్షించడానికి ఈ నిబంధన పెట్టారు. యూరప్ నుంచి దిగుమతి అయ్యే కేన్సర్, ఇతర తీవ్రమైన అనారోగ్యాల చికిత్సలో ఉపయోగించే మందుల ధరలు కూడా తగ్గుతాయి. అలాగే యూరప్ నుంచి భారత్ దిగుమతి చేసుకునే వైద్య పరికరాల ధరలు కూడా తగ్గుతాయి.యూరప్ నుంచి దిగుమతి చేసుకునే విమానాల విడి భాగాలు, మొబైల్ ఫోన్లు, హైటెక్ ఎలక్ట్రానిక వస్తువులపై సుంకాలు తగ్గుతాయి. ఇది భారతదేశంలో గా÷-జడెట్ల తయారీ ఖర్చులను తగ్గిస్తుంది. తుది వినియోగదారునికి ప్రయోజనం చేకూరుస్తుంది. ముఖ్యంగా మొబైల్ ఫోన్లు చౌకగా లభించవచ్చు.ఇనుము, ఉక్కు, రసాయన ఉత్పత్తులపై సున్నా సుంకాల ప్రతిపాదన ఉంది. దీని వలన నిర్మాణ, పారిశ్రామిక రంగాలలో ముడి పదార్థాల ధరలు తగ్గుతాయి. అలాగే చాక్లెట్లు, సౌందర్య సాధనాలు, పలు గృహోపకరణాలు కూడా గతంలో కంటే చౌకగా లభిస్తాయి. ఇక, భారత్‌లో తయారయ్యే వస్త్రాలు, పాదరక్షలు, ఆటో భాగాలు, రత్నాలు, ఆభరణాలు, ఫర్నిచర్, క్రీడా వస్తువులు, రసాయనాలు, యంత్ర పరికరాలపై ఈయూ పన్నుల నుంచి మినహాయింపు లభిస్తుంది. ఈ మేరకు భారతీయ వస్త్ర, ఫుట్‌వేర్, ఆటో మొబైల్స్, ఇంజినీరింగ్ ఉత్పత్తుల సంస్థలు భారీగా లాభపడనున్నాయి.

# నేటినుంచే మేడారం జాతర

మొదటి తరువాయి



ఏకకాలం చేపట్టారు. ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ భక్తులకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు. ఒకవైపు వనదేవతల గద్దెల పునర్నిర్మాణ పనులు సాగుతున్న సమయంలోనే లక్షలాది మంది ముందస్తుగా అమ్మలను దర్శించుకున్నారు. ప్రధాన జాతర తేదీల్లో భక్తుల రద్దీ కారణంగా గద్దెల ప్రాంగణం వద్ద అమ్మల దర్శనం ఆషామాషీ విషయం కాదు. ఈసారి గ్దదెల పునర్నిర్మాణం నేపథ్యంలో ప్రాకారం విస్తరించారు. రూ.100 కోట్లతో చేపట్టిన ఈ పనులు ఈసారి జాతరకే వన్నె తీసుకొచ్చాయి. విస్తరణ నేపథ్యంలో ఏకకాలంలో 9-10 వేల మంది దర్శించుకొనే వెసులుబాటు ఉంటుందని చెబుతున్నారు. వనదేవతలు సమ్మక్క-సారలమ్మ మహాజాతర ఒక ఘట్టం మంగళవారం ప్రారంభం కానున్నది. ఊరట్టం పంచాయతీ కన్నెపల్లి గ్రామం నుంచి పోలెబోయిన వంశీయులు మేడారంలోని జంపన్నవాగు ఒడ్డున ఉన్న గద్దెపై రాత్రి 7 గంటలకు జంపన్నను తీసుకురానున్నారు. జంపన్నను ఆదివాసీల్లోని నాలుగో గొట్టుకు చెందిన పోలెబోయిన వంశీయులు దశాబ్దాలుగా కొలుస్తున్నారు. గతంలో ఇంటివద్దనే పూజలు చేసుకునేవారు. 2022 నుంచి జంపన్నను గద్దెకు తీసుకువస్తున్నారు. గతంలో జంపన్నను తీసుకువచ్చిన పోలెబోయిన సత్యం గతేడాది అనారోగ్యంతో మరణించడంతో ఈసారి అతడి సోదరుడు శ్రీను ఆ బాధ్యతలు తీసుకున్నారు. మేడారం మహాజాతర బుధవారం నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం పూనుగొండ్లలో కొలువైన పెనుక వంశీయుల ఇలవేల్పు, సమ్మక్క భర్త పగిడిద్దరాజును మేడారానికి తీసుకెళ్తారు. మహాజాతర పగిడిద్దరాజు చేరికతో ప్రారంభమవుతుంది. మంగళవారం తెల్లవారుజాము నుంచే గ్రామంలో పెనుక వంశీయులు పగిడిద్దరాజు ఆలయాన్ని శుద్ధి చేసి ముగ్గులు వేసి మామిడి తోరణాలతో అలంకరిస్తారు. గ్రామంలోని పెనుక వెంటేశ్వర్లు ఇంట్లో పగిడిద్దరాజుకు ఆదివాసీ సంప్రదాయంలో ప్రత్యేక పూజలు చేస్తారు. అక్కడి నుంచి పాన్పును ఊరేగింపుగా గ్రామంలోని ఆలయానికి తీసుకెళ్తారు. అనంతరం పడగ రూపంలో పగిడిద్దరాజును పెళ్లికొడుకుగా ముస్తాబు చేసి ఊరేగింపుగా మేడారానికి బయల్దేరుతారు. అటవీ మార్గంలో కాలినడకన వెళ్తూ మంగళవారం రాత్రి లక్ష్మీపురంలో బస చేస్తారు. బుధవారం ఉదయం మళ్లీ మొదలై మధ్యాహ్నం వరకు మేడారం చేరుకుంటారు. గ్దదెలపై పగిడిద్దరాజును ప్రతిష్ఠించడంతో మహాజాతర మొదటి ఘట్టం మొదలవుతుంది.

# సంపాదకీయం

## మేడారం..
## ఓ మహా జనజాతర !




తెలంగాణలో జాతరలకు ప్రత్యేక స్థానం ఉంది. చిన్నాచితకా జాతర్లను ప్రతీ గ్రామంలోనూ..ఆయా ప్రాంతాల్లోనూ చూస్తుంటాం. జాతరలో అనేక రకాల దేవతలను స్మరించుకుంటుంటారు. ఒక్కో జాతర ఒక్కో లక్ష్యంగా సాగుతుంది. స్థానిక దేవతులకు మొక్కులు చెల్లించుకునే జాతరలు ఈ ప్రాంతంలో కోకొల్లు. కొమురవెల్లి, కొత్తకొండ.. కొండపోచమ్మ...ఇలా అనేక జాతరలు ప్రసిద్ది చెందాయి. ఆంధ్రప్రదేశ్‌లో కూడా అనేక జాతరలు సాగుతుంటాయి. అయితే ఇవన్నీ ఒక ఎత్తయితే..మేడారం జాతర మరో ఎత్తు. కేవలం గిరిజన సంప్రదాయాలకే పరిమతమైన ఈ జాతర ఇప్పుడు సర్వజనావళి ఆమోదంగా మారింది. ఇక్కడి సమ్మక్క-సారలమ్మకు మొక్కులు చెల్లించుకోవడం కోసం గిరిజనేతులరే ఎక్కువగా వస్తున్నారు. గద్దెలను దర్శించుకోవడం, బంగారం సమర్పించుకోవడం..మొక్కులు చెల్లించుకోవడం వంటివన్నీ గిరిజన సంప్రదాయంలో సాగినా...అందరినీ ఆకట్టుకునే, ఆకర్శించే జారతగా మేడారం మారింది. అలాగే జాతర నాలుగు రోజులు కోట్ల రూపాయల వ్యాపారం కూడా సాగుతుంది. సామాన్య వ్యాపారులకు ఇక్కడ బతుకు సాగుతుంది. మొత్తంగా మేడారం... జనజాతరకు రంగం సిద్దం అయ్యింది. రెండేళ్ల కోమారు జరిగే జాతర కోసం ప్రజలు కళ్లల్లో వత్తులు వేసుకుని చూస్తుంటారు. అమ్మవార్లను దర్శించుకోవడం ఆయనవాయితీగా పెట్టుకున్నవారికి మేడారం జాతర ఓ మహాపండగ. కుటుంబాలతో కలసి అమ్మవారి గద్దెలను దర్శించుకుని, మొక్కులు చెల్లించుకోవడం..తృప్తిగా ఇంటికి రావడంతో మనసు పులకించి పోతుంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఓ మారుమూల గ్రామం మేడారం ఇవాళ ప్రపంచ వ్యాప్తంగా తలెత్తుకుని చూసేలా సిద్దం అయ్యింది. నిజానికి మేడారం పేరులోనే ఒక మహత్తు ఉందేమో అనిపిస్తుంది. ఎందుకంటే ఈ పేరు చెప్పగానే గిరిజనులు సహా, ఇక్కడికి వచ్చే భక్తులు పులకించి పోతారు. కొత్త చైతన్యం కానవస్తుంది. అమ్మవారిని దర్శించుకోగానే సరికొత్త జీవితంలోకి అడుగు పెడుతుంటారు. అంతా అమ్మదయ అన్న ధీమాతో జీవనాయనం సాగిస్తుంటారు. ప్రతి రెండేళ్లకు ఒకసారి జరిగే ఈ జాతర నిర్వహణ జిల్లా పాలనా యంత్రాంగానికి ఒక పెద్ద సవాల్ లాంటిదే. అయితే వారు కూడా అలవోకగా ఈ జారతను నిర్వహిస్తుంటారు. అందుకు అమ్మదయ కూడా కారణం కావచ్చు. దాదాపు కోటి మందికి పైగా గిరిజనులు, గిరిజనేతరులు హాజరయ్యే ఈ జాతర గిరిజన సంస్కృతీ, సాంప్రదాయాలను ఇప్పటికీ పాటిస్తూ ప్రత్యేకంగా నిలిచింది. ఒక అటవీ కుగ్రామంలో మౌలిక సదుపాయాలు అంతంతమాత్రంగానే ఉన్న ప్రాంతంలో జరిగే ఈ జాతరను గిరిజన కుంభమేళాగా అభివర్ణిస్తారు. ఈ జాతరకు హాజరయ్యే భక్తజన కోటి ఏయేటికాయేడు పెరుగుతందే తప్ప తగ్గడం లేదు. కేవలం ఆ తల్లుల దర్శనం చేసుకుంటే చాలు తమ కష్టాలు మాయం అవుతాయన్న భరోసాతో భక్తులు వస్తుంటారు.అందుకే ఏటేటా భక్తుల రాక పెరుగుతోంది. ఎంతోమంది ఎడ్ల బండ్లలో మేడారానికి వచ్చి కనీసం మూడు రోజులు బస చేస్తారు. ఇక్కడే వంటావార్పు చేసుకుని తమ జీవితం ధన్యమయ్యిందని భావిస్తారు. మతాలు, దేశాలు, పద్ధతులు వేరైనా సరే జాతరలు సహజంగా జరిగేవే. కానీ, ఏ జాతరకూ లేని ప్రత్యేకతలు, ఏ జాతరలోనూ కనిపించని విశిష్టతలు మేడారంలో కనిపిస్తాయి. గలగల పారే సంపంగివాగులో పుణ్యస్నానాలు చేసే కుంభమేళా లాంటి దృశ్యాలు ఇక్కడా కనిపిస్తాయి. గణగణ మోగే గంటలు హిందూ దేవాలయాల వాతావరణాన్ని ప్రతిధ్వనిస్తాయి. కొండకోనల మధ్య జనసందోహం శబరిమలను తలపిస్తుంది. తలనీలాలు సమర్పించుకుని మొక్కులు చెల్లించే మరో తిరుమల ప్రత్యక్ష మవుతుంది. ఈ జాతర కేవలం కోయల సంప్రదాయాలను గౌరవించడం, గుర్తించడం వరకు మాత్రమే పరిమితం కాదు. నమ్మిన జనం కోసం ప్రాణమైనా ఇవ్వాలనే ఓ సందేశం కూడా అంతర్లీనంగా ఉంటుంది. యుద్ధంలో గెలిచిన కాకతీయులు సామ్రాజ్యాన్ని విస్తరించుకుని చక్రవర్తులయ్యారు. పోరాటం చేసిన మేడరాజులు మాత్రం దేవుళ్లు అయ్యారు. అయితే ఇక్కడికి వచ్చే వారెవ్వరూ గత చరిత్రలోకి వెళ్లరు. అమమవార్లపై ఉన్న నమ్మకంతో మొక్కులు చెల్లించుకుంటారు. మళ్లీమళ్లీ వస్తామని మొక్కుకుంటారు. మేడారం మహా జాతరకు అందుకే భక్తులు పోటెత్తుతారు. సమ్మక్క, సారలమ్మ దర్శనం కోసం లక్షలాదిగా తరలివస్తుంటారు. వరాలిచ్చే దేవతలుగా వెలుగొందుతున్న తల్లులను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. జాతర పరిసరాలు కిక్కిరిసిపోయిన, దర్శనం అవుతుందా కాదా అన్న సందేహం లేకుండా ముందుకు సాగుతుంటారు. మేడారం-పస్రా, మేడారం-తాడ్వాయి రహదారుల వెంట చెట్లకింద భక్తులు విడిది చేయడం ఆనవాయితీ. ప్రకృతి ఒడిలో వంటలు చేసుకొని విందుభోజనాలు చేస్తూ ఇళ్లకు తిరుగు ప్రయాణమవుతుంటారు. గుడిలో దేవుడు..పూజారి, ప్రత్యేక పూజలు, అభిషేకాలు, పొర్లు దండాలు వంటివన్నీ ఏవీ లేని ఈ జాతర తెలంగాణ జాతరల్లో ప్రత్యేకంగా నిలిచిపోతుంది. కోటానుకోట్ల మందికి ఆర్థ్య దైవంగా సమ్మకక్క-సారలమల్మ జాతర నాలుగు రోజులు రంజుగా సాగనుంది.

# ప్రధాని మోదీ సందేశాన్ని వక్రీకరించిన గ్రోక్..

### వివాదాస్పదమైన ట్రాన్స్‌లేషన్

**న్యూఢిల్లీ :- జనవరి 27 (మహా ప్రభ)**
ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ కు చెందిన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్ (ఆ) ఏఐ టూల్ గ్రోక్ పై తాజాగా మరో వివాదం చెలరేగింది. రిపబ్లిక్ డే సందర్భంగా మాల్దీవుల నుంచి వచ్చిన శుభాకాంక్షల సందేశానికి సమాధానంగా ప్రధాని మోదీ ఇచ్చిన సందేశం అర్థాన్ని గ్రోక్ పూర్తిగా మార్చేసింది. ఆ సందేశం భావాన్ని వక్రీకరించింది.భారత 77వ గణతంత్ర వేడుకలను పురస్కరించుకుని మాల్దీవులు అధ్యక్షుడు మొహమ్మద్ మొయిజ్జు శుభాకాంక్షలు తెలిపారు. అందుకు కృతజ్ఞతలు తెలుపుతూ ప్రధాని మోదీ ఎక్స్ వేదికగా ఒక పోస్టు పెట్టారు. ఇరుదేశాల్లోని ప్రజల ప్రయోజనాల కోసం కలిసి పనిచేస్తామని అందులో రాసుకొచ్చారు. దివేహి (మాల్దీవులు అధికారిక భాష) లో ఆ పోస్టు పెట్టారు. అయితే మోదీ సందేశాన్ని గ్రోక్ పూర్తిగా మార్చేసింది. ఆ సందేశానికి పూర్తిగా భిన్నమైన అర్థంలో ఆంగ్లంలోకి అనువాదం చేసింది. 'మాల్దీవుల్లో భారత 77వ స్వాతంత్ర్య వేడుకలు జరిగాయి. అందులో మాల్దీవుల ప్రభుత్వం పాల్గొంది. ఈ ప్రభుత్వం భారత వ్యతిరేక ప్రచారాల్లో పాల్గొంది' అని ఇరుదేశాల సంబంధాలను దెబ్బతీసేలా అనువదించింది. గణతంత్ర దినోత్సవం పదం స్థానంలో స్వాతంత్ర్య దినోత్సవం అని ట్రాన్స్‌లేట్ చేసింది. ఇరుదేశాల సంబంధాలను దెబ్బతీసేలా ఉన్న ఈ అనువాదం వివాదాస్పదమవుతోంది. గ్రోక్‌పై ఆధారపడితే ప్రమాదం తప్పదని నెటిజన్‌లు పోస్టులు పెడుతున్నారు. ఏఐ ఫీచర్లన్నీ ప్రయోగదశలోనే ఉన్నాయని సంబంధిత సంస్థలు చెబుతున్నాయి. కాగా గ్రోక్ మహిళలు, చిన్నారుల అసభ్య చిత్రాలను సృష్టిస్తోందని ఇప్పటికే భారత్ సహ ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలు ఆరోపించాయి. దాంతో దిద్దుబాటు చర్యలు చేపట్టిన ఎక్స్.. గ్రోక్‌లో ఫొటోలను ఇబ్బందికరంగా మార్చే అవకాశం లేకుండా చర్యలు తీసుకున్నట్లు తెలిపింది.


# దక్షిణ కొరియా దిగుమతులపై సుంకాలు 25శాతానికి పెంపు



**వాషింగ్టన్ - జనవరి 27 (మహా ప్రభ)**
ఆటోలు, కలప మరియు ఫార్మాస్యూటికల్స్ సహా దక్షిణ కొరియా వస్తువులపై సుంకాలు పెంచనున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సోమవారం ప్రకటించారు. అమెరికాతో కుదుర్చుకున్న గత వాణిజ్య ఒప్పందానికి అనుగుణంగా దక్షిణ కొరియా వ్యవహరించడం లేదని ఆరోపించారు. తాజా పెంపుతో ఆ దేశంపై సుంకాలు 15శాతం నుండి 25శాతానికి చేరనున్నాయి. వారి ప్రత్యేక హక్కు అయిన మా చారిత్రక వాణిజ్య ఒప్పందాన్ని దక్షిణ కొరియా శాసనసభ అమలు చేయడం లేదని తన సోషల్ మీడియా ట్రూత్‌లో పేర్కొన్నారు. టారిఫ్‌ల పెంపు గురించి ముందస్తుగా తమకు తెలియదని దక్షిణ కొరియా అధ్యక్ష కార్యాలయం వెల్లడించింది. ప్రస్తుతం కెనడాలో ఉన్న వాణిజ్య మంత్రి కిమ్ జంగ్-క్వాన్, అమెరికా వాణిజ్య కార్యదర్శి హోవార్డ్ లుట్నిక్‌తో ఈ అంశంపై చర్చలు జరిపేందుకు వాషింగ్టన్ వెళ్లనున్నారని ఒక ప్రకటనలో పేర్కొంది. అమెరికా మరియు దక్షిణ కొరియా వాణిజ్యం మరియు భద్రతా ఒప్పందాన్ని కుదుర్చుకున్న కొన్ని నెలల తర్వాత, ఉద్రిక్త చర్చలు ముగిసిన అనంతరం ట్రంప్ నుండి ఈ ప్రకటన వెలువడటం గమనార్హం. గతేడాది అక్టోబర్‌లో ట్రంప్ దక్షిణ కొరియా అధ్యక్షుడు లీజే మ్యూంగ్‌తో సమావేశమైన తర్వాత ఈ ఒప్పందం ఖరారైంది. అమెరికా సుంకాల తగ్గింపులతో పాటు దక్షిణకొరియా పెట్టుబడి వాగ్దానాలను కూడా చేర్చింది. అయితే ఈ ఒప్పందానికి దక్షిణకొరియాలో చట్టపరమైన అవరోధం ఎదురవుతోంది. అమెరికాకు దక్షిణకొరియా ఎగుమతుల్లో ఆటో పరిశ్రమ 27శాతం వాటాను కలిగి ఉంది. ఇది దేశం యొక్క కార్ల ఎగుమతుల్లో సుమారు సగం ఉంటుంది.

# మెక్సికో ఫుట్‌బాల్ మైదానంలో నరమేధం..

### 11 మంది మృతి




**న్యూఢిల్లీ :- జనవరి 27 (మహా ప్రభ)**
మెక్సికోలో కాల్పులు కలకలం సృష్టించాయి. ఫుట్‌బాల్ మైదానంలో దుండగులు తుపాకులతో విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. ఈ ఘటనలో 11 మంది మృతిచెందారు. 12 మందికి పైగా గాయపడ్డారు. మృతుల్లో ఒక మహిళ, చిన్నారి ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. మెక్సికోలోని గ్వానాహువాటో రాష్ట్రం సలమంకా నగరంలో ఆదివారం రాత్రి ఈ ఘటన జరిగింది. సాకర్ మ్యాచ్ పూర్తయిన తర్వాత పలువురు అభిమానులు మైదానంలోనే ఉన్నారు. అదే సమయంలో అక్కడకు వచ్చిన పలువురు దుండగులు కాల్పులకు దిగారు. దాదాపు 100 రౌండ్ల కాల్పులు జరిపినట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ ఘటన వెనుక గల కారణాలు మాత్రం తెలియరాలేదు. అయితే ఈ ఘటన వెనుక ఆర్గనైజ్‌డ్ క్రైమ్ గ్యాంగ్ ఉందని సలమంకా మేయర్ సీజర్ ప్రిటో తెలిపారు. శాంతి భద్రతలను అదుపులోకి తీసుకొచ్చేందుకు మెక్సికో ప్రభుత్వం సహకరించాలని కోరారు. అధికారులను లొంగదీసుకునేందుకు క్రైమ్ గ్యాంగ్‌లు తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారని పేర్కొన్నారు.

గ్వానహువాటోలో చమురు దోపిడీ, డ్రగ్స్ ట్రాఫికింగ్‌కు సంబంధించిన గ్యాంగ్‌ల మధ్య కొంతకాలంగా ఆధిపత్య పోరు నడుస్తోంది. ముఖ్యంగా జాలిస్కో న్యూ జనరేషన్ కార్టెల్, శాంటారోసా డి లామా కార్టెల్ గ్యాంగ్‌ల మధ్య గొడవలు నడుస్తున్నాయి. తాజాగా సాకర్ గ్రౌండ్‌లో జరిగిన కాల్పులు కూడా ఈ రెండు గ్యాంగ్‌ల మధ్య వార్‌గానే అనుమానిస్తున్నారు.

# విశ్వాసం అంటే ఇది..

### గడ్డకట్టే చలిలోనూ యజమాని డెడ్‌బాడీకి రక్షణగా నిలిచిన శునకం



**న్యూఢిల్లీ :- జనవరి 27 (మహా ప్రభ)**
యజమాని పట్ల ఓ శునకం తన విశ్వాసాన్ని చాటుకుంది. మరణించిన యజమాని మృతదేహానికి గడ్డ కట్టే చలిలో దాదాపు 4 రోజులపాటూ కాపలా కాసింది. ఈ హృదయ విదారక ఘటన హిమాచల్ ప్రదేశ్‌లో చోటు చేసుకుంది. హిమాచల్ ప్రదేశ్ లో ప్రస్తుతం భారీగా హిమపాతం పడుతోంది. రోడ్లపై మంచు పేరుకుపోయింది. ఇంట్లో నుంచి బయటకు వచ్చే పరిస్థితి లేదు. భారీ హిమపాతం, ఎముకలు కొరికే చలితో అక్కడ ప్రస్తుతం కఠినమైన వాతావరణ పరిస్థితులు ఉన్నాయి. చలి తీవ్రతకు తట్టుకోలేక ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. అయితే, మృతదేహానికి ఓ పెంపుడు శునకం దాదాపు నాలుగు రోజులపాటూ గడ్డకట్టే చలిలోనూ కాపలా కాసింది. చంబా జిల్లాలోని భర్మౌర్ ప్రాంతంలో పియూష్ అనే వ్యక్తి కనిపించకుండా పోయాడు. అతడు కఠినమైన వాతావరణ పరిస్థితుల మధ్య మంచులో చిక్కుకుపోయి ప్రాణాలు కోల్పోయి ఉంటారని అధికారులు, స్థానికులు అంచనా వేశారు. ఈ క్రమంలో సమీప ప్రాంతంలో వారి కోసం రెస్క్యూ బృందాలు గాలింపు చేపట్టాయి. ఈ క్రమంలో వారికి కనిపించిన ఓ దృశ్యం అందరినీ భావోద్వేగానికి గురిచేసింది. అడవి జంతువుల నుంచి రక్షించుకునేందుకు పియూష్ డెడ్‌బాడీ వద్ద ఆ శునకం కాపలాగా ఉంది. గడ్డకట్టే చలిలో నాలుగురోజులపాటూ తిండి, నీళ్ల లేకుండా కాపలా కాసింది. రెస్క్యూ సిబ్బందిని కూడా యజమాని డెడ్‌బాడీ వద్దకు రానివ్వలేదు. ఈ దృష్యం చూసి అక్కడివారంతా చలించిపోయారు. ఇందుకు సంబంధించిన దృష్యాలు వైరల్ అవుతున్నాయి.

# రామకోటి రామరాజుకు భద్రాచల దేవస్థానం పిలుపు

-త్వరలోనే తెలంగాణ రాష్ట్రానికి రానున్న గోటి తలంబ్రాలు
- త్వరలోనే గ్రామ గ్రామాన మూగనున్న రామనామం
-భక్తిరత్న జాతీయ అవార్డు గ్రహీత రామకోటి రామరాజు





**దుబ్బాక - జనవరి 27 (మహా ప్రభ)**
తెలంగాణ రాష్ట్రం నుండి గోటి తలంబ్రాలు అందించే బాధ్యత సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణానికి చెందిన శ్రీ రామకోటి భక్త సమాజం సంస్థ వ్యవస్థాపక, అధ్యక్షులు, భక్తి రత్న జాతీయ అవార్డు గ్రహీత రామకోటి రామరాజుకు బాధ్యతను భద్రాచలం దేవస్థానం కల్పించింది. దీనికి సంబంధించిన 3 క్వింటాళ్ల గోటి తలంబ్రాలు శ్రీరామ నవమికి భద్రాచలం సీతారాముల కళ్యాణానికి అందించాలి. గోటితో కొలిచిన తలంబ్రాలు వాడడం ఆనవాయితీ, దీనికి సంబంధించిన వడ్లను తీసుకపోవడానికి 3 రోజుల్లో భద్రాచలం రావలసింది భద్రాచలం ఆహ్వానం పంపిందని సంస్థ అధ్యక్షులు రామకోటి రామరాజు మంగళవారం నాడు రామకోటి కార్యాలయంలో తెలిపారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భక్తితో భద్రాచలం దేవస్థానం అందించే వడ్లను తెలంగాణ రాష్ట్రంలోని లక్షలాది భక్తులచే రామనామ స్మరణ చేయించి ఒలిపించి శ్రీరామనానికి భద్రాచలం అందిస్తానని తెలిపారు. భక్తులందరూ గోటి తలంబ్రాలు మా గ్రామానికి ఎప్పుడు వస్తాయా అని వేయికళ్లతో ఎన్నో గ్రామాలు ఎదురు చూస్తున్నాయని తెలిపారు 4వ సారీ భద్రాచలంలో స్థానం దక్కడఓ మా అదృష్టం అన్నారు.

# సంగారెడ్డి దత్తగిరిలో ఆధ్యాత్మిక శోభ..!

- వైభవంగా కొనసాగుతున్న రాజశ్యామల దేవి ఉత్సవాలు
- బుధవారం ముగింపు వేడుకలు
- భారీ ఏర్పాట్లు పూర్తి
- హాజరుకానున్న పీఠాధిపతులు, ఆధ్యాత్మికవేత్తలు
- నేటితో ముగియనున్న నందిని శ్రీగిరి దీక్ష



**జహీరాబాద్ - జనవరి 27 (మహా ప్రభ)**
సంగారెడ్డి పట్టణంలోని పోతిరెడ్డిపల్లి క్రాస్‌రోడ్ సమీపంలో గల దత్తగిరి మహారాజ్ ఆశ్రమంలో లోక కళ్యాణార్థం ఆశ్రమ పీఠాధిపతులు మాతృశ్రీ అనసూయ మాత, శ్రీశ్రీశ్రీ 1008 వైరాగ్య శిఖామణి అవధూతగిరి మహారాజ్, మహామండలేశ్వర్ డా. సిద్ధేశ్వరానంద గిరి మహారాజ్ ఆధ్వర్యంలో ఈ నెల 19న ప్రారంభమైన రాజశ్యామల దేవి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా వసంత పంచమి, రథసప్తమి, గణతంత్ర దినోత్సవ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. నేటి ఉదయం కుంకుమార్చన, లలితా సహస్రనామ పారాయణం, రుద్రహోమం, మధ్యాహ్నం చండీ యజ్ఞం నిర్వహించి పూర్ణాహుతితో ఉత్సవాలకు ముగింపు పలుకనున్నారు. భక్తుల రాక దృష్ట్యా ఆశ్రమంలో భారీ స్థాయిలో ఏర్పాట్లు చేశారు. ఆశ్రమానికి చెందిన మాతాజీ నందిని శ్రీగిరి చేపట్టిన అనుష్ఠానం బుధవారంతో ముగియనుంది. ముగింపు వేడుకల ఏర్పాట్లను పూజ్య శ్రీ ఆనంతగిరి మాత, సంగారెడ్డి దత్తగిరి మహారాజ్ ఉత్సవ కమిటీ పర్యవేక్షిస్తూ ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తోంది. ముగింపు వేడుకలకు పీఠాధిపతులు, ఆధ్యాత్మికవేత్తలు, ప్రముఖ రాజకీయ నాయకులు, వేదపండితులు, భక్తులు భారీ సంఖ్యలో హాజరుకానున్నారు. కాగా గత తొమ్మిది రోజులుగా అర్చకులు మఠం శివశక్తి, శ్రీపాద స్వామి, వైదిక పాఠశాల విద్యార్థుల చేత పూజలు నిరంతరంగా కొనసాగుతున్నాయి.

# వికారాబాద్ లో బిఆర్ఎస్ జెండా ఎగరవేస్తాం

**బిఆర్‌టీ యూ జిల్లా అధ్యక్షుడు టైగర్ కృష్ణయ్య**



**వికారాబాద్ జిల్లా - జనవరి 27 (మహా ప్రభ)**
జరగబోయే మున్సిపల్ ఎన్నికల్లో వికారాబాద్ జిల్లాలో నాలుగు మున్సిపాలిటీలకు గాను, నలిగింట్లో భారీ మెజారిటీ తో బి ఆర్ ఎస్ పార్టీ జెండా ఎగురావేస్తామని, బి ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు, బి ఆర్ టీ యూ జిల్లా అధ్యక్షుడు, టైగర్ కృష్ణయ్య ధీమా వ్యక్తం చేశారులి కాంగ్రెస్ పార్టీ అవినీతి, అసమర్థ పాలన, ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రజలకిచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీలను, అమలు చేయకపోవడం, అవినీతి, అక్రమాలల్లో ముఖ్యమంత్రి తో సహా అనేక మంది మంత్రులు ఇరుక్కోవడం, రైతులను, ఉద్యోగులను, కార్మికులను, నిరుద్యోగులను, కాంగ్రెస్ పార్టీ గోరంగా మోసం చేసిందని, ఇవ్వాన్ని బి ఆర్ ఎస్ పార్టీ కి, కలిసివచ్చే అంశాలనీ కృష్ణయ్య పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రొండున్నర సంవత్సరాలు గడుస్తున్న, సీఎం ,రేవంత్ రెడ్డి , స్పీకర్ ప్రసాద్ కుమార్, ఇద్దరూ వికారాబాద్ జిల్లా నుండే ప్రాతినిధ్యం వహిస్తున్న , జిల్లాలో నాలుగు మున్సిపాలిటీలు ఉన్నాప్పటికీ , ఇప్పటి వరకు కొడంగల్ కు తప్ప వికారాబాద్ కు, పరిగి కి, తాండూరు కు ఒక్క రూపాయి కూడ ఇవ్వలేదని కృష్ణయ్య విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల్లో ఏ మొఖం పెట్టుకునీ ఓట్లూ అడుగుతారని? కృష్ణయ్య కాంగ్రెస్ నాయకులను ప్రశ్నించారు. జిల్లాలో బి ఆర్ ఎస్ పార్టీ జిల్లా నాయకులు, జిల్లాలో పార్టీ సీనియర్ నాయకులను, ఉద్యమ నాయకులను, కొత్తవారిని, అందరినీ కలుపుకొని పోతే, అందరి సలహాలు, సూచనలు, తీసుకొని, గెలిచే అభ్యర్థులకు మాత్రమే టికెట్ లు ఇవ్వాలని కృష్ణయ్య సూచించారు. అట్లాయితే జిల్లాలో బి ఆర్ ఎస్ పార్టీ కి, తిరుగు లేదని కృష్ణయ్య పేర్కొన్నారు. అందుకోసం రాష్ట్ర నాయకత్వం, సమన్వయకర్తలు, చొరవ తీసుకోవాలని కృష్ణయ్య విజ్ఞప్తి చేశారు వికారాబాద్ జిల్లా అభివృద్ధి చెందాలంటే బి ఆర్ ఎస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజారిటీ తో గెలిపించుకోవాలని ఓటర్లు కు కృష్ణయ్య పిలుపునిచ్చారు.

# మాదిగల ఐక్యవేదిక మండల కమిటీ ఎన్నిక

**వెల్దండ - జనవరి 27 (మహా ప్రభ)**
వెల్దండలో మాదిగల ఐక్యవేదిక మండల కమిటీ ఎన్నికలు మంగళవారం జరిగాయి. గొల్లోనిపల్లి దూల సామెల్‌ను అధ్యక్షుడిగా, ముంగలశెట్టి మల్లేష్‌ను ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, కోశాధికారి, ప్రచార, మీడియా, సంస్కృతిక కార్యదర్శులతో పాటు మరో 20 మంది సభ్యులను కూడా ఎన్నుకున్నట్లు ప్రకటించారు.నూతన కమిటీకి నాయకులు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# ఐదు రోజుల పని దినాలను వెంటనే అమలు చేయండి

UFBU బ్యాంకు సిబ్బంది డిమాండ్




**జనవరి 27 (సూళ్లూరుపేట) మహా ప్రభ ప్రతినిధి.**
దేశవ్యాప్తంగా బ్యాంకు సేవలు అందిస్తున్న బ్యాంకు సిబ్బందికి 5 రోజుల పని దినాలను వెంటనే అమలు చేయాలని దేశవ్యాప్తంగా జరిగే సమ్మె ను మంగళవారం సూళ్లూరుపేట స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(సూళ్లూరుపేట బ్రాంచ్) నందు సమ్మె చేశారు. దీని ప్రభావంతో ప్రభుత్వ రంగ బ్యాంకుల కార్యకలాపాలు నిలిచిపోయాయి. బ్యాంకులపై ఆధారపడే వినియోగదారులు, వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని వినియోగదారులు ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకోవాలని తెలిపారు.

# తోట శంకర్ గుండెపోటుతో మృతి..

-తోట కుటుంబంలో విషాదఛాయలు...



**శంషాబాద్ - జనవరి 27 (మహా ప్రభ)**
శంషాబాద్ మధుర నగర్ కాలనీకి చెందిన తోట శంకర్ మంగళవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందాడు. అతని మరణం పట్ల కుటుంబ సభ్యులు, ఎయిర్పోర్ట్ కాలనీ , మధుర నగర్ లో విషాద ఛాయలు అలుముకున్నాయి. తమతో ఎంతో కలసి మెలిసి ఉండే శంకర్ హఠాత్తు మరణం తమను ఎంతగానో కలిసి వేసిందని పలువురు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

# మిర్యాలగూడ బాపూజీ నగర్ లో అగ్నిప్రమాదం



**మిర్యాలగూడ ప్రతినిధి// - జనవరి 27 (మహా ప్రభ)**
నల్గొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలో బాపూజీ నగర్ లో మంగళవారం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. పూర్తి వివరాల్లోకి వెళ్ళగా టపాకాయల తయారీలో ఉపయోగించే పేపర్ రోల్స్ పరిశ్రమలో షార్ట్ సర్క్యూట్ కారణంగా ఆకస్మికంగా మంటలు చెలరేగాయి క్షణాల్లోనే గోదామంతా దట్టమైన పొగలతో నిండిపోయింది ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు సంఘటన స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది అప్రమత్తంగా స్పందించి మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ప్రమాదంలో పేపర్ రోల్స్ తయారీకి ఉపయోగించే యంత్రాలు ఇతర సామగ్రి పూర్తిగా దగ్ధమయ్యాయి గోదాం వద్ద నిలిపి ఉంచిన ఒక బైక్ కూడా మంటల్లో కాలిపోయింది. అయితే అదృష్టవశాత్తు ఎలాంటి ప్రాణం నష్టం జరగలేదు ప్రమాదం అదుపులోకి రావడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు ఘటనపై సంబంధిత అధికారులు విచారణ చేపట్టారు.

# అటు రోడ్డు వేస్తుంటే ఇటు బీటలు వారుడేంది ?



**మంచిర్యాల - జనవరి 27 (మహా ప్రభ)**
జైపూర్ మండలం కుందారం పరిధిలోని ఆర్ అండ్ బి ప్రధాన రహదారి రోడ్డు నిర్మాణ లోపాలను స్థానిక గ్రామస్తులు ఎత్తిచూపారు. మంగళవారం ఓవైపు అటు రోడ్డు వేస్తుండగానే ఇటు వెనకాల బీటలు వారుడేందని రోడ్డు పనులను నిర్వహించే సిబ్బందిని వారు ప్రశ్నించారు.సమాధానం చెప్పాల్సిన సిబ్బందిలోని శ్రీనివాస్ అనే లేబర్ ఇన్చార్జి కాస్తా... దురుసుగా ప్రవర్తించడంతో గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సైట్ ఇంచార్జ్ అఖిల్ సానుకూలంగా స్పందించి, రోలర్ వైబ్రేషన్ వలన ఎక్కడైతే రోడ్డులో బీటలు ఉన్నాయో, ఆ ప్రాంతాన్ని సరి చేస్తామని గ్రామస్తులకు సర్ది చెప్పారు.దీనితో గ్రామస్తులు శాంతించి, నిబంధనలకు విరుద్ధంగా, నాసిరకం పనులతో నాణ్యతలేని రోడ్డును వేసి ప్రజాధనం వృధా చేయకూడదని హెచ్చరించారు.

# గువ్వల బాలరాజు చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలి

**- మహబూబ్ అలీ**



**అచ్చంపేట, – జనవరి 27 (మహా ప్రభ)**
నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఐఎన్టియుసి తాలూకా అధ్యక్షుడు మహబూబ్ అలీ బీజేపీ నాయకులపై తీవ్ర విమర్శలు చేశారు. మాజీ బిఆర్ఎస్ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు ఇటీవల బీజేపీలో చేరిన తర్వాత కాంగ్రెస్ ఎమ్మెల్యే వంశీకృష్ణపై చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. మహబూబ్ అలీ మాట్లాడుతూ, గతంలో బిఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో బాలరాజు చేసిన భూకబ్జాలు, గుప్తనిధుల వ్యాపారం, గుండాయిజం వంటి విషయాలను కాంగ్రెస్ పెద్దలు మాత్రమే వివరించారని, వాటిపై బీజేపీ నాయకులు ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం పద్ధతి కాదని అన్నారు. అచ్చంపేట ప్రజలు వంశీకృష్ణను గౌరవిస్తున్నారని, ఆయన ప్రజల సమస్యలను నిత్యం పరిష్కరిస్తూ అభివృద్ధి పనులు చేస్తున్నారని తెలిపారు. బీజేపీ నాయకులు కూడా వంశీకృష్ణతో పనులు తీసుకుంటున్నారని, ఆయన పేదవారిని పార్టీలను చూడకుండా ఆదుకుంటున్నారని పేర్కొన్నారు. గువ్వల బాలరాజు అహంకారమే ఆయన ఓటమికి కారణమవుతుందని, ప్రజలు మళ్లీ ఆయనకు డిపాజిట్ రాకుండా ఇంటికి పంపడానికి సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు.

# విజయ డెరీ రైతుల సమస్యలు పరిష్కరించాలి

**-చైర్మన్ అమిత్ రెడ్డి, ఎండి చంద్రశేఖర్ రెడ్డికి వినతి పత్రాలు అందజేత**
**-డిసిసిబి డైరెక్టర్ గంప వెంకటేష్ గుప్తా, విజయ డైరీ అధ్యక్షుడు కడారి రామకృష్ణ**



**కడ్తాల్, – జనవరి 27 (మహా ప్రభ)**
: కడ్తాల్ మండల కేంద్రంలో విజయ పాల డైరీ రైతులు ఎదుర్కొంటున్న పలు రకాల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ మంగళవారం హైదరాబాద్ లో తెలంగాణ రాష్ట్ర విజయ పాల సహకార సంఘం చైర్మన్ గుత్త అమిత్ రెడ్డి, ఎండి చంద్రశేఖర్ రెడ్డిలను కలిసి వినతి పత్రం అందజేసినట్లు డిసిసిబి డైరెక్టర్ ఆమనగల్లు సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా, విజయ పాల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు కడ్తాల్ మాజీ ఉప సర్పంచ్ కడారి రామకృష్ణ ఆధ్వర్యంలో విజయ పాడి రైతులతో కలిసి కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో కడ్తాల్ మండల కేంద్రంలో ఎక్కువమంది రైతులు పాడి పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నారని తెలంగాణ రాష్ట్రంలో అన్ని మండలాల కంటే కడ్తాల్ మండలంలో అత్యధికంగా 2,70,000 పాల ఉత్పత్తి కడ్తాల్ మిల్క్ చిల్లింగ్ సెంటర్ కు పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. కడ్తాల్ మండలం నుంచి పెద్ద మొత్తంలో పాల సరఫరా జరుగుతుందని వీటిని దృష్టిలో పెట్టుకొని ఈ ప్రాంత పాడి రైతులను ఆదుకోవాలని వారు కోరారు. పాల ధరలు పెంచాలని అదేవిధంగా విజయపాల ఉత్పత్తిలో కొనసాగుతున్న ఎస్ ఎన్ ఎఫ్ డి టెన్షన్ పరిధిని ఎత్తి వేయాలని వారు కోరినట్లు తెలిపారు. ఈ ప్రాంత రైతుల సమస్యలను విన్న చైర్మన్, ఎండి సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాడి రైతులు రంగయ్య, శ్రీకాంత్ రెడ్డి, జితేందర్ రెడ్డి, దశరథం, లాలు నాయక్, రాజ్యా నాయక్, పత్య నాయక్, నర్సింహారెడ్డి, ప్రవీణ్ యాదవ్, బాలా చారి, మల్లేష్, శంకర్, కృష్ణయ్య, హరియానాయక్, వెంకటేష్, పూర్యానాయక్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్పొరేషన్ నామినేషన్ల ఏర్పాట్ల పరిశీలన

**- కలెక్టర్ పమేలా సత్పతి**




**కరీంనగర్, – జనవరి 27 (మహా ప్రభ)**
కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 66 డివిజన్లు, చొప్పదండి మున్సిపాలిటీ 14 వార్డులు, జమ్మికుంట మున్సిపాలిటీ 30 వార్డులు, హుజురాబాద్ మున్సిపాలిటీ 30 వార్డులకు ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ నామినేషన్ల స్వీకరణ ఏర్పాట్లను పరిశీలించారు. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కౌంటర్లను పరిశీలించి, అభ్యర్థులు వచ్చే మార్గంవెళ్లే మార్గం వేరుగా ఉండేలా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటిస్తూ నామినేషన్లు స్వీకరించాలని సూచించారు. నామినేషన్ల స్వీకరణ సమయంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తామని పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం తెలిపారు.

# మున్సిపల్ ఎన్నికలను సజావుగా నిర్వహించాలి

**- కలెక్టర్ కే. హైమావతి**



**సిద్ధిపేట, – జనవరి 27 (మహా ప్రభ)**
రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు హుస్నాబాద్, దుబ్బాక, చేర్యాల, గజ్వేల్ మున్సిపాలిటీలలో జరగనున్న 2వ సాధారణ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు జిల్లా ఎన్నికల అధికారి మరియు కలెక్టర్ కే. హైమావతి నోడల్ అధికారులను నియమించారు. మంగళవారం రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుమిదిని జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, ఎన్నికలను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా, ఎలాంటి తప్పులకు తావు లేకుండా నిర్వహించాలని ఆదేశించారు. తరువాత కలెక్టర్ కే. హైమావతి కలెక్టరేట్‌లో జిల్లా నోడల్ అధికారులతో సమావేశమై, ఎన్నికల నిర్వహణలో మ్యాన్‌పవర్ మేనేజ్‌మెంట్, శిక్షణ, బ్యాలట్ బాక్సుల రవాణా, మెటీరియల్ మేనేజ్‌మెంట్, ఖర్చుల పర్యవేక్షణ, మీడియా హెల్ప్‌లైన్, ఫిర్యాదుల పరిష్కారం, నివేదికలు, మైక్రో ఆబ్జర్వర్లు వంటి కీలక అంశాలకు బాధ్యతలు అప్పగించారు. నియమితులైన నోడల్ అధికారులు జిల్లా ఎన్నికల యంత్రాంగంతో సమన్వయం చేసుకుంటూ, రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం విధులు నిర్వహించాలని సూచించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియను నిర్వహించడం జిల్లా యంత్రాంగం లక్ష్యమని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో డిఆర్‌ఓ నాగరాజమ్మ, కలెక్టరేట్ ఏవో రాజ్‌కుమార్, డిఆర్డిఓ జయదేవ్ ఆర్య, డీఈఓ శ్రీనివాస్ రెడ్డి, జడ్పీసీఈఓ రమేష్, డిపిఆర్ఓ రవికుమార్, ఈడీ ఎస్సీ కార్పొరేషన్ అధికారులు, డివిజనల్ పంచాయతీ అధికారి, సహకార అధికారి నాగేశ్వరరావు, ఎన్నికల శిక్షణ అధికారులు అయోధ్య రెడ్డి, రామస్వామి, అసిస్టెంట్ మోటర్ వెహికల్ ఇన్స్పెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే చింతకుంట సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో భారీ చేరికలు




**పెద్దపల్లి, – జనవరి 27 (మహా ప్రభ)**
పెద్దపల్లి పట్టణంలోని 1వ వార్డు బందంపల్లిలో బిఆర్ఎస్ మాజీ కౌన్సిలర్ వీరబోయిన శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ మాదసి రవీందర్, ప్రసాద్, కడారి తిరుపతి, దామోదరీ శ్రీనివాస్, కొలకాని రవి, నక్క శంకర్, చిట్టవేన మహేష్?తో పాటు మరో 20 మంది నాయకులు బిఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరారు. వారందరికీ కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించిన పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు ఈ సందర్భంగా మాట్లాడుతూ, కాంగ్రెస్ బలోపేతానికి చేరికలు ఊపందిస్తున్నాయని పేర్కొన్నారు. తరువాత ఎమ్మెల్యే విజయరమణ రావు పెద్దపల్లి పట్టణంలోని 21వ వార్డు శాంతినగర్లో విద్యుత్ ప్రజాబాటలో భాగంగా ఎస్.ఎస్. 137/100 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్ ను 160 కేవీఏ సామర్థ్యంతో విస్తరించి ప్రారంభించారు. విద్యుత్ శాఖ అధికారులు, స్థానిక నాయకులు, మాజీ కౌన్సిలర్లు, శాంతినగర్ కాలనీ వాసులు, కాంగ్రెస్ కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# టీఎన్జీవో క్యాలెండర్ ను ఆవిష్కరించిన అడిషనల్ కలెక్టర్ చంద్రయ్య



**మంచిర్యాల, – జనవరి 27 (మహా ప్రభ)**
టీఎన్జీవో మంచిర్యాల యూనిట్ అధ్యక్షులు నాగుల గోపాల్ ఆధ్వర్యంలో ముఖ్యఅతిథి మంచిర్యాల జిల్లా అడిషనల్ కలెక్టర్ చంద్రయ్య రెవెన్యూ (టీఎన్జీవో) మంచిర్యాల జిల్లా అధ్యక్షులు గడియారం శ్రీహరి విశిష్ట అతిథులుగా టీఎన్జీవో మంచిర్యాల జిల్లా కార్యదర్శి భూముల రామ్మోహన్ కేంద్ర సంఘం కార్యదర్శి పొన్న మల్లయ్య అసోసియేట్ అధ్యక్షులు శ్రీపతి బాపురావు విచేయగా ముఖ్య అతిథులు టీఎన్జీవో మంచిర్యాల యూనిట్ క్యాలెండర్ టేబుల్ క్యాలెండర్ ను ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా మంచిర్యాల జిల్లా అడిషనల్ కలెక్టర్ చంద్రయ్య మాట్లాడుతూ టీఎన్జీవో మంచిర్యాల యూనిట్ క్యాలెండర్ చాలా బ్రహ్మాండంగా తయారు చేశారని ఇందులో పొందుపరిచిన ప్రతి అంశం ఉద్యోగులకు విధి నిర్వహణలో చాలా ఉపయోగకరంగా ఉంటుందని అదేవిధంగా మంచిర్యాల జిల్లా కార్యవర్గాని యూనిట్ కార్యవర్గంకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో టీఎన్జీవో మంచిర్యాల జిల్లా కోశాధికారి సతీష్ కుమార్ ఉపాధ్యక్షులు శ్రీనివాస్ రాంకుమార్ తిరుపతి అంజయ్య కేజియా రాణి, పద్మ లత, నరేందర్, శ్రీధర్ రాజు సంయుక్త కార్యదర్శిలు సునీత, ప్రభు, సురేందర్, రోశయ్య ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రావణ్ పబ్లిసిటీ సెక్రటరీ యూసుఫ్ మంచిర్యాల యూనిట్ కార్యదర్శి అజయ్ ప్రశాంత్ లక్షటిపేట యూనిట్ అధ్యక్షులు గొల్ల శ్రీనివాస్ బెల్లంపల్లి యూనిట్ అధ్యక్షులు వెంకటేష్ మందమర్రి యూనిట్ అధ్యక్షులు సుమన్ చెన్నూరు యూనిట్ అధ్యక్షులు అభిషేక్ కన్నెపల్లి యూనిట్ అధ్యక్షులు పద్మనాభం జిల్లా కార్యవర్గ సభ్యులు పద్మజ, రాజేందర్, కుమార్, మోసిన్, ప్రణవా నందు, సరిత తదితరులు పాల్గొన్నారు..

## అంగరంగ వైభవంగా శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణం



**కరీంనగర్ ,– జనవరి 27 (మహా ప్రభ)**
పాత మార్కెట్ రోడ్డులో శ్రీ వెంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారి కళ్యాణం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా టీటీడీ సంప్రదాయంగా అందించే పట్టు వస్త్రాలను మంత్రి పొన్నం ప్రభాకర్ సమర్పించారు. కార్యక్రమంలో తిరుమల తిరుపతి దేవస్థానం డిప్యూటీ ఈవో లోక్‌నాథ్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, ఆర్డీవో మహేష్, ఆలయ ఈవోతో పాటు పలువురు నేతలు, అధికారులు పాల్గొన్నారు. వేలాది మంది భక్తులు కళ్యాణ మహోత్సవాన్ని దర్శించుకుని ఆనందభరితులయ్యారు.

# బిజినెస్

## అమెజాన్‌లో భారీ లేఆఫ్స్..

### 16,000 మందిని తొలగించేందుకు రంగం సిద్ధం




ప్రపంచవ్యాప్తంగా అనేక సంస్థల్లో ఉద్యోగుల తొలగింపు కొనసాగుతూనే ఉంది. ఇప్పటికే వేల సంఖ్యలో ఉద్యోగుల్ని తొలగించిన అమెజాన్.. ఇప్పుడు మరోసారి భారీ సంఖ్యలో ఉద్యోగాల కోతకు సిద్ధమవుతోందని సమాచారం. నేటి నుంచే ఉద్యోగుల్ని తొలగించబోతుంది. ఈసారి దాదాపు 16,000 మందిని తీసేయాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది.నేటి నుంచి వారం రోజుల్లోపు ఇందుకు సంబంధించి ఆదేశాలొచ్చే అవకాశం ఉంది. గత ఏడాది చివర్లో అమెజాన్ సంస్థ దాదాపు 14,000 మంది స్టాఫ్‌ను తొలగించింది. ఇప్పుడు మరో 16,000 మందిని తొలగించనుంది. అంటే ఆరు నెలల వ్యవధిలోనే దాదాపు 30,000 మందిని తొలగించినట్లవుతుంది. అంతకుముందు 2023లో 27,000 మందికి ఉద్వాసన పలికింది. ఏఐ, ఆటోమేషన్ కారణంగానే ఉద్యోగుల కోత జరుగుతోందని విశ్లేషకుల అంచనా. ఉద్యోగుల తొలగింపుపై మేనేజర్లు, సీనియర్ లీడర్లకు ఈ మేరకు ఇప్పటికే సమాచారం అందింది. పనితీరు ఆధారంగా కూడా లేఆఫ్స్ జరుగుతున్నాయని అమెజాన్ ఉద్యోగులకు తెలిపింది. అమెజాన్‌లో రిటైల్, వేర్‌హౌజ్ సిబ్బందితోపాటు హై శాలరీ కార్పొరేట్, అడ్మినిస్ట్రేషన్ ఉద్యోగుల్ని కూడా కంపెనీ తొలగిస్తోంది.

## కొత్త రికార్డ్.. రూ.4 లక్షలకు అతి చేరువలో వెండి! ఒక్క రోజులో ఎంత పెరిగిందో తెలిస్తే షాక్ అవుతారు!

మంగళవారం ఉదయం మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ ఫ్యూచర్స్ మార్కెట్లో వెండి ధరలు రూ.30,000 పైగా పెరిగాయి, బంగారం ధరలు దాదాపు రూ.3,700 పెరిగాయి. అయితే సాయంత్రం నాటికి ఢిల్లీ బులియన్ మార్కెట్ ఈ రికార్డును బద్దలు కొట్టింది. విదేశీ మార్కెట్లలో స్పాట్ బంగారం, వెండి ధరల వేగవంతమైన పెరుగుదల ఢిల్లీ బులియన్ మార్కెట్‌లో కూడా కనిపించింది. ఢిల్లీ బులియన్ మార్కెట్లో బంగారం ధరలు రూ.7,300 పెరిగాయి. వెండి ధరలు రూ.40,500 భారీ పెరుగుదలను చూశాయి. నిపుణుల అభిప్రాయం ప్రకారం.. బలమైన పెట్టుబడిదారుల డిమాండ్, పెరుగుతున్న భౌగోళిక రాజకీయ, వాణిజ్య ఉద్రిక్తతల మధ్య ప్రపంచ మార్కెట్లో పెరుగుదల కారణంగా రెండు విలువైన లోహాల ధరలు అపూర్వమైన గరిష్ట స్థాయికి చేరుకున్నాయి. ఇటీవల కెనడా తర్వాత ట్రంప్ దక్షిణ కొరియాపై సుంకాలను ప్రకటించారు. నివేదికల ప్రకారం దక్షిణ కొరియాపై 25 శాతం సుంకం విధించాలనే ట్రంప్ ప్రతిపాదన పెట్టుబడిదారులలో గణనీయమైన భయాందోళనలను సృష్టించింది, వారు ఇప్పుడు సురక్షితమైన




స్వర్గధామాలను వెతుకుతున్నారు. దేశ రాజధాని ఢిల్లీలో బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయో ఇప్పుడు చూద్దాం.. వెండి ధరలు బంగారాన్ని అధిగమించి బలమైన ప్రదర్శనను కొనసాగించాయి. వెండి ధరలు భారీగా రూ.40,500 అంటే 12.3 శాతం పెరిగి కిలోకు రూ.370,000 (అన్ని పన్నులతో సహా) కొత్త గరిష్ట స్థాయికి చేరుకున్నాయి. గత మార్కెట్ సెషన్‌లో కిలో రూ.329,500 వద్ద స్థిరపడింది. కిలో వెండి రూ.400,000 మార్కును చేరుకోవడానికి కేవలం రూ.30,000 మాత్రమే అవసరం.

ఈ క్రమంలో వెండి ధరలు రోజుకు రూ.8,000 నుండి రూ.10,000 పెరిగితే జనవరి 30 నాటికి అది రికార్డు స్థాయికి చేరుకుంటుంది. వాణిజ్యం, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల మధ్య సురక్షితమైన స్వర్గధామంగా వెండికి బలమైన డిమాండ్ ఉన్నందున దేశీయ మార్కెట్లో వెండి కిలోకు రూ.370,000 రికార్డు గరిష్ట స్థాయికి చేరుకుందని ఎణఖీజ సెక్యూరిటీస్‌లోని కమోడిటీస్ సీనియర్ విశ్లేషకుడు సౌమిల్ గాంధీ అన్నారు.

### డాలర్ ధమాల్.. ట్రంప్‌కు చెక్ పెట్టిన భారత్..

## ఒక్క డీల్‌తో తిరుగులేని శక్తిగా రూపాయి..

భారత కరెన్సీ రూపాయి మంగళవారం మార్కెట్లో సత్తా చాటింది. అంతర్జాతీయ పరిణామాలు, ముఖ్యంగా భారత్-యూరోపియన్ యూనియన్ మధ్య కుదిరిన చారిత్రాత్మక వాణిజ్య ఒప్పందం దేశీయ మార్కెట్లకు కొత్త ఊపిరి పోసింది. గత శుక్రవారం డాలర్‌తో పోలిస్తే 92 స్థాయికి పడిపోయి ఆల్ టైమ్ కనిష్టాన్ని తాకిన రూపాయి, మంగళవారం నాటికి 19 పైసలు పుంజుకుని 91.71 వద్ద ముగిసింది. భారత్ ఈయూ ఒప్పందం రూపాయి పుంజుకోవడానికి ప్రధాన కారణంగా చెప్పొచ్చు. 27 దేశాల కూటమితో కుదిరిన



ఈ ఒప్పందం భారత ఎగుమతులకు సుంకం లేని మార్కెట్‌ను కల్పిస్తుంది. దీనిని నిపుణులు మదర్ ఆఫ్ ఆల్ డీల్స్‌గా అభివర్ణిస్తున్నారు. అంతర్జాతీయ మార్కెట్లో ఆరు ప్రధాన కరెన్సీలతో పోలిస్తే డాలర్ విలువ 0.12శాతం తగ్గి 96.92కు పడిపోయింది. గత ఏడాదిలో డాలర్ ఏకంగా 10శాతం పతనమవ్వడం రూపాయికి కలిసి వచ్చింది. భారత్ విదేశీ మారక నిల్వలు ఏకంగా 14.16 బిలియన్ డాలర్లు పెరిగి 701.36 బిలియన్ డాలర్ల మార్కును చేరడం దేశ ఆర్థిక బలానికి నిదర్శనంగా నిలిచింది.

# స్పోర్ట్స్

## ఆఖరి ఓవర్లో ఢిల్లీకి షాకిచ్చిన గుజరాత్..!

మహిళల ప్రీమియర్ లీగ్ లో ఉత్కంఠ పోరు అభిమానులను మునివేళ్లపై నిలబెట్టింది. ఆఖరి ఓవర్ థ్రిల్లర్?లో గుజరాత్ జెయింట్స్ అద్భుతరీతిలో ఓటమి తప్పించుకుంది. భారీ ఛేదనలో ప్రధాన బ్యాటర్లు విఫలమవ్వడంతో ఢిల్లీ క్యాపిటల్స్ కథ ముగిసింది అనుకున్నారంతా. కానీ, నిక్కీ ప్రసాద్(47), స్నేహ్ రానా (29) ఫోర్లు, సిక్సర్లతో చెలరేగి గుజరాత్? నుంచి విజయాన్ని లాగేసుకున్నంత పని చేశారు. అయితే.. ఆఖరి ఓవర్లో రానాను ఔట్ చేసిన సోఫీ డెవెనె చివరి బంతికి నిక్కీని వెనక్కి పంపడంతో.. 3 పరుగుల తేడాతో గుజరాత్ విక్టరీ కొట్టింది.డబ్ల్యూపీఎల్?లో మరో థ్రిల్లింగ్ మ్యాచ్. ఈసారి గుజరాత్ జెయింట్స్ స్టార్ సోఫీ డెవిన్ మ్యాచ్?ను కాపాడింది. ఢిల్లీ క్యాపిటల్స్ బ్యాటర్ల విధ్వంసంతో ఆశలు ఆవిరైన వేళ.. ఆఖరి ఓవర్లో రెండు వికెట్లు తీసి జట్టును గెలిపించింది. 20 వ ఓవర్లో స్నేహ్ రానా(29) ఔట్ కావడం.. చివరి బంతికి




4 రన్స్ అవసరమవ్వగా నిక్కీ ప్రసాద్(47) క్యాచ్ ఔట్ కావడంతో 3 పరుగుల తేడాతో గుజరాత్ విజయం సాధించింది. ప్లే ఆఫ్స్ సమీకరణాలు మారుతు మొదట బ్యాటింగ్ చేసిన గుజరాత్ జెయింట్స్ .. బేత్ మూనీ(58), అనుష్క శర్మ(39), తనూజా కన్వర్(21 నాటౌట్) మెరుపులతో భారీ స్కోర్ చేసింది. ఢిల్లీ బౌలర్లలో శ్రీ చరణి(4-31) రాణించింది.

## నేడు భారత్, కివీస్ నాలుగో టీ20

విశాఖపట్నం

స్వదేశం వేదికగా జరుగనున్న టీ20 ప్రపంచకప్ టోర్నీకి ముందు భారత్ దుమ్మురేపుతున్నది. న్యూజిలాండ్‌పై ఇప్పటికే టీ20 సిరీస్‌ను ఖాతాలో వేసుకున్న టీమ్‌ఇండియా తాజాగా క్లీన్‌స్వీప్‌పై కన్నేసింది. బుధవారం ఇరు జట్ల మధ్య నాలుగో టీ20 మ్యాచ్‌కు సాగరతీర నగరం విశాఖపట్నం వేదిక కానుంది. పరుగుల వరద పారుతున్న సిరీస్‌లో భారత్‌కు కివీస్ దీటైన పోటీనివ్వలేకపోతున్నది. టీమ్‌ఇండియా టాపార్డర్ సూపర్ ఫామ్ మీద ఉంది.ముఖ్యంగా గత మ్యాచ్‌లో యువ బ్యాటర్ అభిషేక్‌శర్మ ఆకాశమే హద్దుగా చెలరేగగా, కెప్టెన్ సూర్యకుమార్‌యాదవ్ ఫామ్‌లోకి రావడం జట్టు విజయ అవకాశాలను మెరుగుపర్చుకుంది. వీరికి తోడు ఇషాన్ కిషన్ వచ్చిన అవకాశాన్ని అందిపుచ్చుకుంటూ దుమ్ముదులుపుతుండగా, సంజూ శాంసన్ ఫామ్ మేనేజ్‌మెంట్‌ను ఆందోళనకు




గురిచేస్తున్నది. బౌలింగ్‌లో బుమ్రా రిథమ్‌లోకి రాగా, హర్షిత్ రానా, అర్ష్‌దీప్‌సింగ్ నిలకడకనబరుస్తున్నారు. స్పిన్నర్లు రవి బిష్ణోయ్, వరుణ్ చక్రవర్తి, కుల్దీప్‌యాదవ్..వైజాగ్ టీ20 పోరులో కీలకం కానున్నారు. మరోవైపు మిగిలిన రెండింటిలోనైనా గెలిచి పరువు కాపాడుకోవాలని కివీస్ చూస్తున్నది.

## వార్మప్ మ్యాచ్‌ల షెడ్యూల్ విడుదల..

### సఫారీలతో ఆడనున్న భారత్




ముంబై

మరికొద్దిరోజుల్లో మొదలుకానున్న టీ20 ప్రపంచకప్‌నకు ముందు ఐసీసీ వార్మప్ మ్యాచ్‌ల షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఫిబ్రవరి 7 నుంచి మార్చి 8 వరకు జరుగబోయే ఈ మెగా టోర్నీకి ముందు.. నాలుగు రోజుల పాటు క్వాలిఫై అయిన జట్లు వార్మప్ మ్యాచ్‌లు ఆడతాయి.ఫిబ్రవరి 2 నుంచి 6 పాటు ఇవి కొనసాగుతాయి. ఇందులో భాగంగా డిఫెండింగ్ చాంపియన్ టీమ్‌ఇండియా, గత ఎడిషన్ రన్నరప్ దక్షిణాఫ్రికా.. ఫిబ్రవరి 4న నవీ ముంబై వేదికగా మ్యాచ్ ఆడుతుంది. భారత ప్రధాన జట్టు కాకుండా ఇండియా 'ఏ'.. 2వ తారీఖున యూఎస్ఏతో, 6న నమీబియాతో మ్యాచ్‌లు ఆడనుంది.




# రణబాలి'గా విజయ్ దేవరకొండ..
## ఆసక్తికరంగా టైటిల్ గ్లింప్స్

గణతంత్ర దినోత్సవం సందర్భంగా విజయ్ దేవరకొండ అభిమానులకు చిత్ర యూనిట్ అదిరిపోయే సర్ప్రైజ్‌ను ఇచ్చింది. రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వంలో విజయ్ నటిస్తున్న తాజా క్రేజీ ప్రాజెక్టుకు 'రణబాలి' అనే పవర్‌ఫుల్ టైటిల్‌ను ఖరారు చేస్తూ టైటిల్ గ్లింప్స్‌ను విడుదల చేసింది చిత్రబృందం. 1854 నుంచి 1878 మధ్యకాలంలో బ్రిటిష్ ఇండియా నేపథ్యంలో ఒక పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా ఈ సినిమా తెరకెక్కుతోంది. అప్పట్లో బ్రిటిష్ వారు సృష్టించిన కరువు పరిస్థితులు, వారి అకృత్యాలకు వ్యతిరేకంగా పోరాడిన ఒక వీరయోధుడి కథను ఈ చిత్రంలో చూపించబోతున్నారు. విడుదలైన గ్లింప్స్‌లో విజయ్ దేవరకొండ ఒక రఫ్ అండ్ పవర్‌ఫుల్ వారియర్ లుక్‌లో కనిపిస్తుండగా, బ్రిటిష్ వారు అతడిని ఒక అనాగరికుడిగా పిలిచేవారని, కానీ మన చరిత్రలో అతడొక గొప్ప వీరుడని గ్లింప్స్ ద్వారా స్పష్టం చేశారు. 'టాక్సీవాలా' వంటి విజయం తర్వాత విజయ్ రాహుల్ కాంబినేషన్‌లో వస్తున్న రెండో సినిమా ఇది కావడం విశేషం.ఈ చిత్రంలో విజయ్ సరసన రష్మిక మందన్న 'జయమ్మ' అనే పాత్రలో నటిస్తోంది. వీరిద్దరి కలయికలో వస్తున్న హ్యాట్రిక్ మూవీ కావడంతో అంచనాలు భారీగా ఉన్నాయి. మరో ఆసక్తికరమైన అంశం ఏమిటంటే, హాలీవుడ్ చిత్రం 'ది మమ్మీ' ఫేమ్ ఆర్నాల్డ్ వోస్లూ ఈ సినిమాలో కీలక పాత్రలో నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ మరియు టీ-సిరీస్ సంయుక్తంగా అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రానికి అజయ్ అతుల్ సంగీతాన్ని అందిస్తున్నారు. ప్రేక్షకుల్లో విపరీతమైన ఆసక్తిని రేకెత్తిస్తున్న ఈ భారీ చిత్రాన్ని సెప్టెంబర్ 11, 2026న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు.



## దృశ్యం పాప గ్లామర్ షో..

# అనసూయ ఒప్పుకుంటే గుడి కడతా..!
### పర్మిషన్ ఇవ్వమంటున్న వీరాభిమాని



అనసూయ.. ఈ ముద్దుగుమ్మ గురించి రెండు తెలుగు రాష్ట్రాల్లో ఉన్న ప్రేక్షకులకు ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. యాంకర్ గా కెరీర్ మొదలు పెట్టి ఇప్పుడు సినిమాల్లో రాణిస్తుంది అనసూయ. జబర్దస్త్ లో తన అందంతో, డాన్స్ లతో, చలాకీ మాటలతో ప్రేక్షకులను కవ్వించింది అనసూయ ఆ తర్వాత సినిమాల్లో నటిస్తూ మంచి క్రేజ్ తెచ్చుకుంది. ఇక ఇప్పుడు సినిమాల్లో నటిస్తూ అలరిస్తుంది. సుకుమార్, రామ్ చరణ్ కాంబినేషన్ లో వచ్చిన రంగస్థలం సినిమాతో మంచి క్రేజ్ తెచ్చుకుంది. దాంతో అనసూయకు అవకాశాలు క్యూ కట్టాయి. ప్రస్తుతం పలు సినిమాల్లో అనసూయ కీలక పాత్రల్లో కనిపించి మెప్పించింది. ఇప్పుడు టీవీ షోలతో పాటు సినిమాల్లోనూ నటిస్తూ బిజీ బిజీగా గడుపుతుంది. పెళ్ళై ఇద్దరు పిల్లల తల్లి అయినప్పటికీ అందంలో కుర్రహీరోయిన్స్ తో పోటీపడుతోంది ఈ ముద్దుగుమ్మ. సినిమాలు, టీవీ షోలతో పాటు సోషల్ మీడియాలోనూ యాక్టివ్ గా ఉంటుంది అనసూయ. రెగ్యులర్ గా తన సినిమా అప్డేట్స్ తో పాటు పర్సనల్ లైఫ్ విశేషాలను, ఫోటోలను కూడా పంచుకుంటుంది. ఇక అనసూయకు ఉన్న ఫ్యాన్ ఫాలోయింగ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఎంతో మంది అనసూయను అభిమానిస్తుంటారు.. కాగా అనసూయకు వీరాభిమాని అయిన ఓ పూజారి చేసిన కామెంట్స్ ఇప్పుడు వైరల్ గా మారాయి.

# గోల్డెన్ ఛాన్స్ కొట్టేసిన సాయి పల్లవి..

సాయి పల్లవి.. కుర్రాళ్ల డ్రీమ్ గర్ల్ ఈ ముద్దుగుమ్మ. చేసింది కొన్ని సినిమాలే అయినా విపరీతమైన క్రేజ్ సొంతం చేసుకుంది. శేఖర్ కమ్ముల దర్శకత్వంలో వచ్చిన ఫిదా సినిమాతో ప్రేక్షకులను కట్టిపడేసింది ఈ చిన్నది. తొలి సినిమాతోనే తన నటనతో ఆకట్టుకుంది.



ఆతర్వాత వరుసగా సినిమాల్లో నటించి మంచి విజయాలను అందుకుంది. తెలుగులో బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేస్తోన్న సాయి పల్లవి ఇప్పుడు హిందీలోనూ సినిమాలు చేస్తోంది. రామాయణం సినిమాలో సీతగా చేస్తోంది ఈ ముద్దుగుమ్మ. సాయి పల్లవి చాలా సింపుల్ గా ఉంటుంది. ఎలాంటి లగ్జరీ ఫెసిలిటీలను సాయి పల్లవి కోరుకోదు. అందుకే దర్శక నిర్మాతలు ఎక్కువగా సాయి పల్లవిని హీరోయిన్ గా తీసుకుంటారు.ప్రస్తుతం సాయి పల్లవి స్లో అండ్ స్టడీగా సినిమాలు చేస్తుంది. తమిళ్ లో అమరన్, తెలుగులో తండేల్ సినిమాలతో హిట్స్ అందుకున్న సాయి పల్లవి ఇప్పుడు బాలీవుడ్ పై ఎక్కువ ఫోకస్ చేస్తుంది. ఇప్పటికే హిందీలో రామాయణం సినిమాలో సీతగా నటిస్తుంది సాయి పల్లవి. అలాగే ఇటీవలే మరో బాలీవుడ్ మూవీ ఏక్ ధిన్ అనే సినిమాను అనౌన్స్ చేసింది. ఇదిలా ఉంటే ఇప్పుడు సాయి పల్లవికి మరో గోల్డెన్ ఛాన్స్ వచ్చిందని తెలుస్తుంది. ఏకంగా సూపర్ స్టార్ సినిమాలో హీరోయిన్ గా ఛాన్స్ అందుకుందని తెలుస్తుంది.

# నవీన్ చంద్ర 'హనీ' నుంచి మనసుని హత్తుకునే 'జో జో లాలి' సాంగ్ విడుదల!

నవీన్ చంద్ర కథానాయకుడిగా నటిస్తున్న సరికొత్త సైకలాజికల్ హారర్ థ్రిల్లర్ 'హనీ' సినిమా నుంచి తాజాగా 'జో జో లాలి' అనే పాట విడుదలైంది. అజయ్ అరసాడ సంగీతం అందించిన ఈ పాట ఎంతో హృద్యంగా, భావోద్వేగభరితంగా సాగుతూ శ్రోతలను ఆకట్టుకుంటోంది. 'పలాస 1978', 'శ్రీదేవి సోడా సెంటర్' వంటి చిత్రాలతో తనదైన గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు కరుణ కుమార్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. మనుషుల మనస్తత్వాలు మరియు మూఢనమ్మకాల నేపథ్యంలో సాగే ఈ చిత్రంలో దివ్య పిళ్లై, దివి వద్యా, రాజా రవీంద్ర కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్‌కు విశేష స్పందన లభించగా, ఈ మెలోడీ సాంగ్ సినిమాపై మరిన్ని అంచనాలను పెంచింది. వావా ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై రవి పీట్ల, ప్రవీణ్ కుమార్ రెడ్డి సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం ఫిబ్రవరి 6, 2026న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.




Edited,Printed,Published & Owned by Mr.Nakka Raju, RNI No : TGTEL/26/A0738, Printed at NEWS 24HRS MEDIA SERVICES,Suryapet,- 508213 Telangana.
Published at 1-113 Prabhat Nagar,Chaitanyapuri,Rangareddy,Telangana - 500060.Telangana State. EDITOR : Mr.NAKKA RAJU, Cell 9160600610 | netibharath.daily@gmail.com